ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 25 | సంచిక : 6 | ఫిబ్రవరి 2020

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977



ఈ సంచికలో....

21-12-2007, అత్తిలి

అరుణాచల మహత్యం

శ్రీమద్భగవద్గీత



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## మహాశివరాత్రి

ప్రతి సంవత్సరం మాఘమాసం, కృష్ణపక్షం చతుర్దశి రోజున మహాశివరాత్రిని జరుపుకుంటాం! లింగోద్భవం జరిగినరోజు అనగా అవ్యక్తమైన, నిరాకారమైన పరమాత్మ లింగరూపం ధరించిన రోజు. దేశకాలాలలో జరుపుకునే శివరాత్రి, నిజమైన శివరాత్రికి గుర్తు. అనగా మన పరమ గమ్యాన్ని గుర్తుచేసే రోజు. సాధారణంగా మన సంప్రదాయంలో అనేక పండుగలు, పర్వదినాలు జరుపుకుంటాం. పండుగ అనగానే విందులు, వినోదాలు గుర్తుకువస్తాయి. కానీ మహాశివరాత్రి విభిన్నమైన పర్వదినం, కారణం ఆ రోజున ఉపవాసం మరియు జాగరణ చేస్తాం! శివుడు అంటే మంగళప్రదుడు, శుభాన్ని ఇచ్చేవాడు. "సంవత్సరములో 364 రోజులు భోగదృష్టిలో ఉన్నా, మహాశివరాత్రినాడు ఒక్కరోజైనా యోగదృష్టిలో ఉండండి" అన్నారు సద్గురు శ్రీనాన్నగారు. మనకు సకల శుభాలను ప్రసాదించే శివుడు మన నుండి కోరుకొనేది, మన అహంకారాన్నే! మన అహంకారాన్ని ఆయన మ్రింగేస్తే, ఇంక మిగిలేది శివుడే! కర్మానుభవము నిమిత్తమే వచ్చిన దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి, మనస్సుతో శివుని ధ్యానించి, చిత్తశుద్ధిని అలవరచుకోవాలి. చిత్తశుద్ధి కలిగినప్పుడు లోపల శాంతి స్వరూపంగా వ్యక్తం అవుతుంది. శివుడిని స్మరించి, ధ్యానించి, ఆయన నామాన్ని హృదయంలో నిలుపుకొని, శరీరం మరణించేలోపే, మరణం లేని స్థితిని పొందాలి. మూడు అవస్థలు, మూడు శరీరాలు, మూడు గుణాలు, మూడు కాలాలు, దాటిన వానికి శివస్వరూపం తెలుస్తుంది.

మనమందరమూ ఈశ్వరుడు మనకు కేటాయించిన పనులను అహంకారం లేకుండా, శ్రద్ధగా, ఈశ్వరార్పణంగా చెయ్యడమే, నిజమైన శివపూజ.

ఓం తత్ సత్

(దిII 21-02-2020 మహాశివరాత్రి సందర్భముగా)

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**మీ చందా గడువు ముగిసినది. కావున చందాను పునరుద్ధరించుకోగలరు.**
భక్తుల కోరికపై సద్గురువు శ్రీ నాన్నగారి భోదామృతం ఇంకా వివరంగా అందివ్వాలనే ఉద్దేశంతో **రమణభాస్కర** మాసపత్రిక సెప్టెంబరు సంచిక నుండి మార్పులు చేయబడినది. దీనికి భక్తుల నుండి సలహాలు, సూచనలు ఆహ్వానిస్తున్నాము. పత్రికకు సంవత్సర చందా కట్టడంలో భక్తులు ఇబ్బందులు చెపుతున్నందు వలన ఇప్పటినుండి **శాశ్వతచందా** (10 సంIIలకు) రుII **1200**/-లుగా నిర్ణయించడమైనది. భక్తులందరూ ఈ అవకాశమును ఉపయోగించుకొని రమణభాస్కర మాస పత్రికకు శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**శాశ్వత చందా** (10 సంIIలకు) రుII **1200**/-లు
**సంవత్సర చందా** రుII **150**/-లు

మీ చందాను స్వయముగా గానీ, లేదా శ్రీ రమణ క్షేత్రం, కార్పొరేషన్ బ్యాంక్ అకౌంట్ నెం. 520101264185724 (IFSC Code : CORP0001613) నందు గాని చెల్లించగలరు. చందాను బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసినవారు జమ చేసిన తేదీ, వారి పూర్తి అడ్రసు 8883147999కు తెలియపరచగలరు.

## ముఖ్య గమనిక

రమణ భాస్కర పత్రిక ప్రతీ నెల 5వ తేదీన పోస్టు చేయటం జరుగుతోంది. పత్రిక 12వ తేదీలోపు మీకు అందని యెడల ఈ క్రింది సెల్ నెంబరుకు ఫోన్ చేసి మీ రశీదు నెంబరు తెలియబరచిన యెడల పత్రిక మరల పోస్టు చేయబడును. కావున భక్తులు గమనించగలరు.
సెల్ : **8883147999**



# శివరాత్రి / శివ తత్త్వము

మూడు కాలాలలో మూడు అవస్థలలో మన ఆధ్యాత్మిక హృదయంలో ఏ వస్తువు అయితే స్వయంగా ప్రకాశిస్తోందో అదే శివుడు. మనలో ఉన్న చైతన్యమే శివుడు. శివరాత్రి విశేషాలని శివతత్త్వాన్ని చాలా సందర్భాలలో శ్రీ నాన్నగారు సూక్ష్మంగా వివరించారు. వారి ప్రవచనాలనుండి కొన్ని అనుగ్రహ వాక్యాలు.

శివరాత్రి అంటే శివుడు లింగరూపం ధరించిన రోజు. శివరాత్రి రోజున సాంప్రదాయం ఏమిటి అంటే శివుడికి అభిషేకం చెయ్యటం, పగలు ఉపవాసం, రాత్రి జాగరణ. ఉపవాసం అంటే కేవలం అన్నం తినటం మానివేయటం కాదు. మనస్సులో విషయచింతన లేకుండా ఉండాలి. ఉప అంటే దగ్గరగా, వాసం అంటే నివసించటం. అంటే ఆత్మరూపంలో ఉన్న శివుడికి దగ్గరగా నివసించటం. జాగరణ అంటే, ఏవో కాలక్షేపం మాటలు చెప్పుకొంటూ సినిమాలు చూస్తూ రాత్రి గడపటం కాదు, రాత్రి అంతా శివస్మరణతో గడపాలి. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. రాత్రి నిద్రపోకుండా ఆయన స్మరణలో గడపటం జాగరణ.

మనకి కృష్ణాష్టమి శ్రీరామనవమి ఎటువంటివో శివరాత్రి అటువంటిదే. రామావతారం కృష్ణావతారం అని చెపుతారు. శివుడు నిత్యావతారం, అంటే నిత్యం ఉండే అవతారం. శివరూపం విష్ణురూపం ఒకే వస్తువుకి రెండు ముఖాలు, శివుడిని ఆరాధించినా విష్ణువుని ఆరాధించినా, అది లోపలఉన్న సత్యవస్తువుకే వర్తిస్తుంది. అందువలన శివకేశవ బేధం పెట్టుకోవద్దు. ఉపాసన కోసం మన పెద్దలు ఇలా ఏర్పాటు చేసారు. శివుడు జ్ఞానాన్ని ఇస్తాడు, విష్ణువు మోక్షాన్ని ఇస్తాడు అని పురాణాలలో చెపుతారు. శివుడు ఇచ్చే జ్ఞానం, విష్ణువు ఇచ్చే మోక్షం ఒకటే. ఆ రెండు వేరు అనుకోవటం వలన మనకు కంగారు వస్తోంది కాని ఇవి రెండూ ఒకటే. శివుడిని కాని విష్ణువుని కాని ఉపాసన చేయటం ద్వారా, వారిని ఆధారంగా చేసుకొని, ఈ సృష్టికి ఆధారంగా ఉన్న పరబ్రహ్మాంను పొందుతారు.

శివరాత్రి రోజున బోయవాడి కథ ఎక్కువగా చెపుతారు. కొంతమందికి ఏరోజున పనికి వెళ్ళకపోతే ఆ రోజున అన్నం ఉండదు. శివరాత్రి రోజున ఆ బోయవాడికి పని దొరకలేదు. అందుచేత ఆ రోజున పగలు భోజనం లేదు. రాత్రి నడుము వాల్చుకోవటానికి ఒక చెట్టు

మీద కూర్చుని, నిద్రపట్టక కాలక్షేపానికి ఆ చెట్టు ఆకులని గిల్లి కింద వేస్తున్నాడు. ఆ చెట్టు కింద శివలింగం ఉంది. అది వాడికి తెలియదు. ఆ పత్రి అంతా శివలింగం మీద పడుతోంది. ఆ పత్రికి బాగా మంచు పట్టింది, అది కూడా శివలింగం మీద పడుతోంది. అంటే వాడికి తెలియకుండా పత్రితోటి పూజ చేస్తున్నాడు, పత్రి మీద ఉన్న నీరు శివుడికి అభిషేకం అవుతున్నాయి. అంటే వాడికి పగలు ఉపవాసం, రాత్రి జాగరణ, శివపూజ అయిపోయింది. వాడు తెలియక చేసినా, వాడికి మోక్షం వచ్చేసింది. తెలియక చేస్తేనే అంత ఫలితం వచ్చింది; తెలిసుండి చేస్తే ఇంకెంత ఫలితం వస్తుంది అని చెప్పటానికి ఈ బోయవాడి కథ చెపుతారు.

శివుడిని లింగరూపంలో అర్చన చేస్తారు. మనము అందరం ఏదో ఒక రూపముతో నామముతో గుణముతో తాదాత్మ్యం పొందుతాము. నేను అది సాధించాను ఇది సాధించాను అని కర్మతో తాదాత్మ్యం పొందుతాము. అంటే మనం సాకారంలో ఉన్నాము. సత్యం నిరాకారం, నిర్గుణం. ఒక రూపంతోటి ఒక నామంతోటి తాదాత్మ్యం పొందుతున్న మనం రూపం లేనివాడిని, పేరులేని వాడిని పట్టుకోలేము కాబట్టి మనకు సపోర్టుకోసం ఆయన లింగ రూపం ధరించాడు. సాకారంలో నుండి నిరాకారంలోనికి వెళ్ళటానికి మనకు నూటికి నూరుపాళ్ళు సహకరించేవాడే శివుడు.

శివుడు లయకారకుడు. శివలింగాన్ని ఆరాధన చేయటం, ధ్యానం చేయటం ద్వారా మనకు ఉన్న అలవాట్లలో నుండి విడుదల పొంది, హృదయంలో లయమవుతాము. ఆయన మీ మనస్సును అంతర్ముఖం చేస్తాడు. మీ మనస్సు అంతర్ముఖమైతే ఇంక బాహ్య గొడవలలో నుండి, రాగద్వేషాల నుండి అన్నింటి నుండి మీరు విడుదల పొందుతారు. శివ లింగాన్ని మీరు ధ్యానం చేయటం వలన, మీ మనస్సు అంతర్ముఖం అయ్యి ఆత్మానుభవం పొందటానికి మీరు అర్హులు అవుతారు.

శివుడు అంటే మంగళకరుడు. ఆయన మనకు క్షేమాన్ని ప్రసాదిస్తాడు, శుభాన్ని కలగచేస్తాడు. ఆయన నిరాడంబరుడు. ఆయనకు ఏమీ అక్కరలేదు. కాబట్టే ఇతరులు ఏదైనా అడిగితే వరాలు ఇస్తాడు. అన్నీ నాకే కావాలి అనుకునేవాడు ఇంక ఇతరులకు ఏమి ఇస్తాడు? వాడికి ఏమీ అక్కరలేదు కాబట్టి నీకు ఏదైనా ఇస్తాడు. వాడు శివుడు.

జీవుడు లేదు, ఉన్నవాడు శివుడే. కుండలోని నీటిలో ఆకాశము ప్రతిబింబిస్తుంది. ఆ ప్రతిబింబం నిజం కాదు. నీటివలన ప్రతిబింబము మనకి కనబడుతోంది. కుండ పగిలినా ఆకాశమునకు ఏమీ భంగం లేదు. శివుడు ఆకాశము లాంటి వాడు. కుండలో కనబడే ప్రతిబింబము జీవుడు లాంటిది. జీవుడు లేకుండా శివుడు ఉండగలడు కానీ, శివుడు లేకుండా జీవుడు లేడు. అసలు ఉన్నది శివుడే జీవుడు లేడు. కాని మాయ వలన జీవుడుగా కనిపిస్తున్నాడు.

కైలాసంలో శివుడు ఉన్నాడు. అరుణాచలంలో శివుడు ఉండటం కాదు, అరుణాచలమే శివుడు. అంటే ఆ కొండే శివుడు. అరుణాచలాన్ని తొలి లింగం అంటారు. శివస్మరణ మంగళదాయకం, శుభదాయకం.



ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 19 ఫిబ్రవరి 1984, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఎవరైనా వాళ్లకి తెలియని విషయం ఏదైనా మిమ్మల్ని అడిగారు అనుకోండి, దాని గురించి మీకు తెలుసు అనుకోండి, చెప్పాలి. అలా చెప్పకపోతే మీరు మూగవారితోటి సమానం అని ఆచార్యులువారు చెపుతున్నారు! ఇంగ్లాండులో మనం ఎవరినైనా దారి అడిగితే తప్పనిసరిగా ఎంతో వివరాలతో చెపుతారు. కొంతమంది తెలిసి ఉన్న విషయం కూడా చెప్పరు. వాళ్ళు మూగవారి తోటి సమానం అంటున్నారు ఆచార్యులు వారు.

మీ చేతులు కానీ, మీ నోరు కానీ, మిమ్మల్ని నరకానికి దగ్గర చేస్తున్నాయి. ఎందుచేతనంటే వాటిని మీరు దుర్వినియోగం చేస్తున్నారు. మీరు గౌరవాన్ని ఆశించి కానీ, ఇంకేదైనా ఆశించి కానీ, చేసినది దానం కాదు. దానం చెయ్యటం వల్ల మీకు గౌరవం వస్తుంది అనుకోండి, అది దానం కాదు. మీరు ఇచ్చింది వెంటనే మర్చిపోవాలి; అది దానం. మీరు ఇచ్చింది మీకు సహజంగా మరుపు వచ్చేయాలి. మళ్ళీ మీరు జ్ఞాపకం తెచ్చుకుందాము అనుకున్నా మీకు జ్ఞాపకం రాకూడదు.

మనకి అవసరమైన విషయాలు ఒక్కటి జ్ఞాపకం రావు. పనికి రాని గొడవలు అన్నీ జ్ఞాపకం వస్తాయి. సాయంత్రం మంచం పైన అలా పడుకునేసరికి ఈ పనికిరాని గొడవలు అన్నీ గుర్తుకొస్తాయి. చచ్చేవరకూ అంతే! మనందరం ఏదో ఒక రోజున చచ్చిపోతాము కదా, జ్ఞాపకం ఉండటం కోసం చెపుతున్నాను. చచ్చిపోయే ముందు కూడా పనికిరాని దరిద్రపు గొడవలు అన్నీ జ్ఞాపకం వస్తాయి. మరణించే రోజు ఏదో ఒక రోజు వస్తుంది కదా, శుక్రవారమో, శనివారమో, ఆదివారమో! ఏదో ఒక రోజు మన కోసం కనిపెట్టుకొని ఉంది,

ఆ రోజు వచ్చేసరికి మనకి పనికి వచ్చే గొడవలు ఒక్కటీ జ్ఞాపకం రావు, పనికిరాని గొడవలన్నీ సిద్ధం అవుతాయి. సరిగ్గా ప్రాణం పోయే టైములో పనికిరాని గొడవలన్నీ సిద్ధం అవుతాయి. ఎందుకు వస్తున్నాయి అంటే హృదయంలో అవే ఉన్నాయి కాబట్టి! ఈ లోపున మరి మేము పూజ చేసామండీ, జపం చేసామండీ అని మీరు అడగొచ్చు; నోటితోటి చేసారు. హృదయంలో వాటికి చోటెక్కడ ఉంది! మీ నోరు కనుక హృదయంలో ఉంటే అవసరంలేని తలంపులు అసలు రానే రావు.

లోపల రాగద్వేషాలు ఉంటాయి, ఇష్టా అయిష్టాలు ఉంటాయి. ఆ ఇష్టా అయిష్టాలకి పాలేరుతనం చేస్తున్నాము. మనం అనుకుంటాము స్వతంత్రులమని. కాని మనం బానిసలం. మనలో ఇష్టానికి అయిష్టానికి కూలి పని చేసి పెడుతున్నాము. ఈ దేహాన్ని మనస్సుని వాటికోసం ఖర్చు పెడుతున్నాము. మనం స్వతంత్రులము కానే కాదు. స్వతంత్రుడు కాని వాడు ఆత్మని దర్శించలేడు. మనం బానిసలము, మనందరం కూలివాళ్ళం! మీరు దానం చేసి గౌరవాన్ని ఆశిస్తే, ఆ గౌరవానికి మీరందరూ కూలివాళ్ళు. ఫలితాన్ని ఆశించేవాడు కూలివాడే! మీరందరూ యజమానులు కాదు, కూలివాళ్ళు. ఎవడు యజమాని? ఎవడైతే ఫలితాన్ని ఆశించకుండా పని చేస్తాడో వాడికి వాడు యజమాని. మిగతా వాళ్ళంతా కూలివాళ్ళు. మేము చాలా దానాలు చేసామండీ అని గర్వం లోపల ఉంటుంది, వాళ్ళందరూ కూలివాళ్ళే.

పంజాబులో సిక్కుల మత గురువు దగ్గరికి ఒకడు వెళ్ళాడు. శీతాకాలం పొద్దున చలి పెడుతోంది, ఎండలో కూర్చున్నాడు. ఈ ధనవంతుడు ఆయన దగ్గరికి వెళ్ళాడు. ఈయన చాలా గొప్పవారు, దానాలు చేసారు అని చెప్పటం కోసం, కూడా ఒకడిని తీసుకొని వెళ్ళాడు. ఈ లోపల బెల్లం చుట్టూ చీమలు చేరినట్టు, ధనవంతుని చుట్టూ కొంతమంది జనం చేరతారు. వాడిని పొగుడుతారు, వాడి దగ్గర ఆ గుణాలు ఉండవు పాపం! మీరు చాలా గొప్పవారు అంటారు. గొప్పతనం ఏమీ లేదు, డబ్బుల కోసం వీడిని పొగుడుతారు! ఈ సిక్కుల మతగురువు చలిగా ఉందని ఎండలో కూర్చున్నాడు. ఈ ధనవంతుడి కూడా వచ్చిన వాడు గురువుగారితో, ఇతను ఫలానా వాడు అండీ, పంజాబులో ఇంతటి ధనవంతుడు లేడు, ఎన్నో దానధర్మాలు చేసాడు, మీకు కూడా తనకి తోచింది ఇవ్వటానికి వచ్చాడు అని చెపుతాడు. పోనీ ఇవ్వ వచ్చును కదా, తోచింది ఇవ్వటానికి వచ్చాడు అని ఈ గొడవ అంతా ఎందుకు అసలు! అతనికి తోచింది ఇవ్వడానికి వచ్చాడు, గొప్ప దానకర్ణుడు అని ఏదో చెపుతాడు. ఈయన చలి పెడుతోందని ఎండలో కూర్చున్నాడు. ఆ కోటీశ్వరుడు

ఎదురుగా కూర్చున్నాడు. ఆ సిక్కుల గురువు ఇలా ముఖం పైకి ఎత్తాడు. నువ్వు నాకు దానం ఏమీ చెయ్యొద్దు, నా మీద ఎండ పడకుండా అడ్డుగా నుంచున్నావు పక్కకి తప్పుకో, అదే దానం, సరిపోతుంది వెళ్ళిపో అన్నాడు.

ఇంకొక గురువు అలకనంద అనే నది ఒడ్డున కూర్చుని ఉన్నాడు. ఆయన దగ్గరికి ఇంకో కోటీశ్వరుడు వచ్చాడు. వాడు ఇంకొకడిని కూడా తీసుకొచ్చాడు. ఈ కోటీశ్వరుడు ఒక బంగారంతో చేసిన కడియం తీసుకొచ్చి గురువు చేతిలో పెట్టాడు. ఎంత గొప్ప బహుమానం ఇస్తున్నాను, ఎంత విలువైన కడియం చేయించాను అనుకొంటూ, ఆ కడియం గురించి నువ్వు చెప్పు అని పక్కవాడికి చెప్పాడు. లోపల అహంకారం పొంగుతోంది అతనికి. ఈయన ఒకసారి కడియం ఇలా చూసాడు, వాడికున్న అహంభావన చూసి, ఆ కడియం అలా నదిలోకి విసిరేశాడు. అప్పుడు ఇంకో కడియం ఇచ్చాడు. అప్పుడు ఆ కడియం ఎక్కడ ఉందో ఈ కడియం వెదికి తెస్తుందని, ఈ కడియం కూడా విసిరేసాడు.

ఇది మనకి ఆశ్చర్యంగా ఉంటుంది. మనకి అర్థంకాని విషయాలు ఇవన్నీ. ఈ లోకం యొక్క గౌరవాలు, సంపదలు, సుఖాలు మహాత్ములకి అక్కరలేదు. డబ్బు సుఖం ఎలా ఉంటుందో నేను కలలో కూడా ఎప్పుడూ అనుభవించలేదు అని చెప్పాడు రామకృష్ణ పరమహంస. డబ్బు సుఖం అనేది ఎలా ఉంటుందో, స్త్రీ సుఖం అనేది ఎలా ఉంటుందో నేను కలలో కూడా ఎప్పుడూ అనుభవించ లేదు అని రామకృష్ణుడు అన్నాడు. ఐ హేవ్ నెవర్ ఎన్జాయ్డ్ ఇవెన్ ఇన్ ఎ డ్రీమ్! మనం బుర్రలు బద్దలుకొట్టుకున్నా వాళ్ళు ఎక్కడ ఉన్నారో మనకి అర్థం కాదు.  రాజసిక దానాలు వాళ్ళు లక్ష్యం చెయ్యరు. సత్వగుణంతో చేసిన దానాలు వాళ్ళు లక్ష్యం చేస్తారు కానీ, రజోగుణంతో చేసే దానాలు వాళ్ళు లక్ష్యపెట్టరు. అక్కడ వస్తువు ప్రధానం కాదు, హృదయాన్ని చూస్తారు.

అమెరికాలో స్వామి వివేకానంద ఉపన్యాసం విన్న తరువాత ఒకడు కొన్ని లక్షల రూపాయలు తెచ్చి ఇచ్చాడు.  చూసారా ఎంత డబ్బు ఇచ్చానో మీకు అని వివేకానందుడి తోటి అన్నాడు. కానీ వివేకానంద డబ్బు అలా పారేయలేదు. ఈయన మొండి వాడు! నన్ను చూడటం వల్ల నీకు దానం చెయ్యాలనే గుణం పుట్టింది, నువ్వెవడవు  చెయ్యటానికి, అన్నాడు అతనితో. నన్ను చూడక ముందు నీకు దానం చెయ్యాలనే గుణం ఎప్పుడైనా కలిగిందా? కలగలేదు. నీకు ఈ గుణం కలగటానికి నేనే కారణం. అంచేత ఇందులో ఆశ్చర్యపోవలసింది ఏముంది అన్నాడు. నన్ను కళ్ళతోటి చూడటం వల్ల నీకు ఆ మంచి బుద్ధి కలిగింది. ఇందులో నేను

ఆశ్చర్యపోవటానికి ఏముంది? నువ్వు దానం చెయ్యటానికి నేనే కారణం! ఆయన జీవితం ఆవేశవంతం! నన్ను చూసిన తరువాత నీకు ఆ మంచి సంకల్పం కలిగింది కాబట్టి నువ్వు ఇచ్చావు. ఇందులో నువ్వు అహంకారం పడవలసిన విషయం ఏముంది అన్నాడు. నువ్వు దానం ఇచ్చావంటే, దానికి కూడా నేనే కారణం, నువ్వు కాదు అన్నాడు.

సత్వగుణంతో దానం చేస్తే, ఫలితం అనంతంగా వస్తుంది. ఎందుచేతనంటే ఫలితం ఈశ్వరుడి చేతిలో ఉంది కదా, వాడు అనంతంగా ఇస్తాడు. వీడికి అహంకారం పలచబడుతుంది. పైగా ఈ రెండు విషయాలు కాకుండా ఇంకో రహస్యం ఉంది. దానం ఇచ్చేవాడిలో ఏమైనా చిన్న చిన్న దోషాలు ఉంటే అది పుచ్చుకునే వాడికి వెళ్తాయి. మీరు సత్వగుణంతో కనుక చేస్తే ఇవ్వన్నీ ఖర్చు అవుతాయి. కానీ సత్వగుణంతో చేసేవాళ్ళు ఎంతమంది ఉన్నారు? మీరు సత్వగుణంతో దానం చేస్తే. మీ కుడిచేతి తోటి చేసే పని మీ ఎడమచేతికి కూడా తెలియకూడదు. ఫలితం గురించి ఆలోచించి దానం చేసినా, ఫలితం గురించి ఎవడైనా పని చేసినా, వాడు యజమాని కాదు, వాడు కూలివాడు.

మనం రోజూ నేను నేను అని వాడతాము. ఈ నేనుని తీసుకెళ్ళి ఈశ్వరుడి పాదాల దగ్గర పెట్టి నమస్కరించే శక్తి ఎంతమందికి ఉంది? ముందు "నాది"ని వదలగలిగితే అప్పుడు "నేను"ని వదలగలం. నాది వదలలేనప్పుడు నేనుని వదలలేము. జ్ఞానికి నేను నాది అనే రెండు మాటలూ కూడా అర్థం లేని వ్యర్థమైన మాటలుగా ఉంటాయి. ఈ "నేను నాది" "నేను నాది", సంసారమంతా ఇదే. స్త్రీలు అనుకోవచ్చు భర్త పిల్లలూ సంసారమని, పురుషులు అనుకోవచ్చు భార్య పిల్లలు సంసారమని, అది నిజం కాదు. ఈ "నేను నాది" "నేను నాది" ఇదే సంసారం. సంసారానికి ఇవే రెండు కాళ్ళు; అంటే కుడి కాలు ఎడమ కాలు అని కాదు. ఈ "నేను నాది"! జ్ఞానికి మట్టుకు ఇవి అర్థం లేని వ్యర్థమైన మాటలు అన్నారు ఆచార్యులు వారు. అజ్ఞానికి ఇదే సంసారం. సంసారమంటే మీరు పైకి ఏమనుకొంటున్నారు, ఇల్లు సంసారమని, భార్య సంసారమని, పిల్లలు సంసారమని, భర్త సంసారమని - ఇవన్నీ నిజం కాదు. ఈ "నేను నాది" ఇవే నిజమైన సంసారం.

నిజమైన స్నేహితుడు ఎవరంటే, మనం పొరపాట్లు చేస్తుంటే ఆ పొరపాట్ల నుంచి మనని ఎవడైతే రక్షిస్తాడో, ఆ పొరపాట్లు చెయ్యకుండా మనని ఎవడైతే ఆపుచేస్తాడో, పొరపాట్లు చెయ్యకుండా మంచి మార్గంలో ఎవడైతే మనని ప్రవేశపెడతాడో, మనకి అవసరమైనప్పుడు కూడా ఉంటాడో వాడు స్నేహితుడు. ప్రపంచంలో స్నేహితులు ఎలా

ఉంటారంటే, ఏదైనా అవసరం వచ్చింది అనుకోండి ఒక్క స్నేహితుడు కనబడడు; అవసరం లేనప్పుడు అందరూ స్నేహితులే. ఆరోగ్యంగా ఉన్నప్పుడు అందరూ స్నేహితులే, రోగం వస్తే ఒక్కడు కనపడడు. ఇప్పుడు నా దేహం ఆరోగ్యంగా ఉంది; నేను చెపుతున్నాను, మీరందరూ వినటానికి వస్తున్నారు. రేపు నాకేదైనా రోగం వచ్చిందనుకోండి మీలో ఎంతమంది నన్ను చూడటానికి వస్తారు? ఏసుక్రీస్తు కంటే గొప్పవాడినా నేను, లేకపోతే సోక్రేటిస్ కంటే గొప్పవాడినా! కర్ణుడు ఏమన్నాడు అంటే నాకు గౌరవం లేని రోజులలో, నాకు రాజ్యం లేని రోజులలో, ఆకలితోటి మాడిపోతున్న రోజులలో, ధుర్యోధనుడు పిలిచి నాకు రాజ్యాన్ని ప్రసాదించాడు, సింహాసనం మీద కూర్చోపెట్టి గౌరవించాడు. దుర్యోధనుడు ఎంత దుర్మార్గుడు అని మీరు చెపుతున్నా, వాడు ఎంత దుర్మార్గుడైనా వాడి స్నేహాన్ని విడిచిపెట్టను అన్నాడు కర్ణుడు. రహస్యంగా వచ్చి కుంతీ దేవి నువ్వు నా కొడుకువి అని చెప్పింది. నీ కడుపులోంచే నేను వచ్చాను అని నువ్వు చెపుతున్నప్పటికీ నేను దుర్యోధనుడిని విడిచిపెట్టను అన్నాడు. వాడు నిజంగా దుర్మార్గుడు అయ్యి ఉండవచ్చు; ఈ అంతిమ గడియలలో ఆ స్నేహాన్ని విడిచిపెట్టను అని తల్లితో ఈ మాటలు చెప్పాడు.

భారతం చదివే వాళ్ళు అందరూ అనుకోవచ్చు కర్ణుడు మహా దుర్మార్గుడు అని. కానీ స్నేహం విషయంలో నూటికి నూరు మార్కులు వస్తాయి కర్ణుడికి. వాడు అవకాశవాది కాదు, వాడు స్నేహితుడు. చాలా మంది స్నేహితులు అవకాశ వాదులు. సర్వసాధారణంగా ఉపకారం వెంటనే మర్చిపోయే స్వభావం మనుషులలో ఉంటుంది; అది ద్రోహం. గతించిపోయిన రోజులలో ఎవరైనా మీకు ఉపకారం చేసి ఉంటే, (పైకి ఏమీ పొగడక్కరలేదు ఆ మనుషులని), హృదయంలో ఒక్కసారి వాళ్ళని స్మరించుకొని, హృదయంలో వారి పట్ల కృతజ్ఞతాభావం కలిగిఉండాలి.

ఈ షిప్పులు ఎంత సేపు నిలబడతాయి అండీ! కర్ణుడికి దుర్యోధనుడికి మధ్యన ఉన్నది మైత్రి. ఇవి మైత్రి కాదు, ఫ్రెండ్ షిప్పులు. ఎంతో మంది ధనవంతులు పాడైపోయారు స్నేహాలు పట్టి. ఎంతో మంది చదువుకున్న వాళ్ళు నాశనమైపోయారు, ఎంతమంది ధనవంతులు వాళ్ళ ధనాన్ని పోగొట్టుకున్నారు ఈ చెడ్డ స్నేహాల వల్ల!

కేవలం మనకు ఆత్మ గురించే చెప్పటం వదిలేసి ఇవన్నీ ఎందుకు చెపుతున్నారు ఆచార్యులు వారు? మన దైనందిన జీవితంలో మనం రోజూ ఎదుర్కొనే సమస్యలలో జాగ్రత్తగా నడుచుకొంటూ ఆధ్యాత్మిక మార్గంలో అభివృద్ధి పొందటంకోసం ఇవన్నీ చెపుతున్నారు. ఆత్మని

తెలుసుకోవటం కోసం చేసే ప్రయత్నంలో మీ హితవు కోరే స్నేహితులు చాలా తక్కువ మంది ఉంటారు అని చెపుతున్నారు ఆచార్యులు వారు. ఎవడైతే మీ హితవు కోరుతున్నాడో, ఎవడైతే మీ హితవు కోరటంలేదో పరిశీలించి చూసుకోమని చెపుతున్నారు. మన జీవితంలో అనేక రకాల మనుషులు తగులుతూ ఉంటారు. వాళ్ళందరినీ ఎలా తప్పించుకు తిరగాలో ఆచార్యులువారు మనకి ఎంతో శ్రద్ధగా చెపుతున్నారు.

మన హితవు కోరేవాడు, మనకి చదువు చెప్పేవాడు కూడా మనకి తండ్రితో సమానం. డబ్బు సంపాదించటం కష్టం కానీ, ఖర్చు పెడితే రెండు రోజులలో అయిపోతుంది. వందకోట్ల రూపాయలు మీ పిల్లలకి మీరు సంపాదించి ఇచ్చి, మీ పిల్లలు ఎవరితో సహవాసాలు చేస్తున్నారో మీరు చూసుకోకపోతే, మీ వంద కోట్లు వంద రోజులలో ఖర్చు అయిపోతాయి. వంద రోజులు చాలు! టాటా బిర్లాల కుటుంబాలు కూడా వాళ్ళ పిల్లలకి సరియైన లక్షణాలు ఉన్నాయో లేదో చూసుకొని వాళ్లకి చదువులు చెప్పిస్తారు. వాళ్ళ ఉద్దేశం ఏంటంటే, ఇన్ని కోట్లు ఉన్నాయి, వాడికి సరియైన బుద్ధి లేకపోతే, మన వెనకాల ఉన్న ఈ ఆస్తి అంతా పోతుంది అని. స్నేహాల విషయంలో కూడా అంత జాగ్రత్తగా ఉంటారు. మీరు ఆత్మ దాకా వెళ్లొద్దు, మీ ఐశ్వర్యం నిలబడాలన్నా మీ పిల్లలు ఎవరితో స్నేహాలు చేస్తున్నారో చూసుకోండి.

వెన్నపూసను తీసుకొని వెళ్లి పొయ్యి దగ్గర పెట్టారనుకోండి, దానిని ఎంతసేపు కరగకుండా ఆపగలరు. అగ్ని దగ్గర ఉంటే అది కరిగిపోయి తీరుతుంది. అదేవిధంగా ఎంత బుద్ధిమంతుడు అయినప్పటికీ, చెడ్డ స్నేహాలు చేస్తే వాడు తప్పనిసరిగా పతనం అయిపోతాడు. ఒక మనిషి అభివృద్ధిలోకి వచ్చినా స్నేహాలే కారణం, పాడైపోయినా స్నేహాలే కారణం. అందరితో మాట్లాడవచ్చును, కానీ స్నేహం విషయంలో జాగ్రత్తగా ఉండాలి.. ఈ లోకంలో అభివృద్ధిలోకి రావాలన్నా, పర లోకంలో అభివృద్ధిలోకి రావాలన్నా, మంచి స్నేహాలు చాలా ముఖ్యం.

ఈ రోజున మనం చెప్పుకునే విషయాలు బాహ్యంగా చూస్తే చాలా చిన్న విషయాలే, కానీ ఆచార్యులవారు ఎంతో క్రిందకి దిగి మనకోసం చెపుతున్నారు. మీరు ఎంత సాధన చేసినా, ఈ సహవాసాల విషయంలో జాగ్రత్తగా లేకపోతే, అంతా బూడిదే! మంటలో పెట్టిన కట్టెలు ఏ విధంగా అయితే బూడిద అయిపోతాయో, మీరు చేసే సాధనలు, మీరు చేసే యోగాలు, మీరు చేసే ధ్యానాలు, జపాలు, ఈ చెడ్డ సహవాసాల వల్ల అన్నీ బూడిద అయిపోతాయి. ఆచార్యులు వారికి భార్య లేదు, పిల్లలు లేరు, సహవాసాలు ఆయనకి కావాలా! మన కోసం దిగివచ్చి చెపుతున్నారు.

కీర్తి పోయినా మళ్ళీ సంపాదించుకోవచ్చు, ఆరోగ్యం పోయినా మళ్ళీ సంపాదించుకోవచ్చు, కానీ శీలం పోతే మళ్ళీ సంపాదించుకోలేము. పప్పులో ఉప్పు ఎటువంటిదో సమాజానికి శీలం అటువంటిది. ఎంతో డబ్బు ఉన్న వాడిని తక్కెడలో కూర్చోపెట్టి, శీలవంతుడిని తక్కెడలో ఇంకో పక్క కూర్చోపెడితే, ఈ శీలవంతుడు ఉన్న వైపు తక్కెడే ఎక్కువ బరువు తూగుతుంది. అదే శీలం యొక్క విలువ. శీలం వల్ల శక్తి పుడుతుంది, శీలం వల్ల జ్ఞానం కలుగుతుంది.

ఏసుక్రీస్తుని శిలువ వేసినప్పుడు, ఏసుక్రీస్తు ఇలా కష్టపడ్డాడు అని చెప్పుకునే వారు కూడా లేరు అప్పుడు. ఏసుక్రీస్తు ఇటువంటి మంచిమాటలు చెప్పాడు అని ముచ్చటకైనా చెప్పేవాళ్ళు లేకుండా పోయారు. కానీ తరువాత కాలంలో ఆయన మాట లోకమంతా వ్యాపించింది. మీరు నిజం అనుకున్నది, సత్యం అనుకున్నది, ప్రశాంతంగా చెప్పి శరీరం విడిచిపెట్టండి. ఆ మాట లోకం అంతా వ్యాపిస్తుంది. సత్యాన్ని మాట్లాడకుండా, సత్యాన్ని గౌరవించకుండా మీరు సత్యాన్ని ఎలా దర్శించగలరు?

మోక్షం కూడా మనం సంపాదించేది కాదు, భగవంతుడు ఇచ్చేది. ఆయన ఇస్తే మనం పుచ్చుకోవాలి కానీ, మనము డిమాండ్ చేసేది కాదు. కారులోనో రైలులోనో టికెట్టు అడిగినట్టు కాదు. అదే భగవాన్ చెప్పారు, మీ బాధలు అన్నీ నాతోటి చెప్పుకొంటున్నారు, నా బాధలు ఎవరితో చెప్పుకోను? మనం అనాధలము కాదు, భగవంతుడు అనాధ అన్నారు. భగవంతుడు మట్టుకు అనాధుడే, ఆయనకి నాధుడు లేడు.

ఎవరికోసమైతే మనము కష్టపడుతున్నామో ఒక్కోసారి మనస్సు ఎదురు తిరుగుతుంది వాళ్ళమీద. వాళ్ళని ప్రేమిస్తాము, కానీఒకోసారి మనస్సు ఎదురు తిరుగుతుంది. ఎందుకొచ్చిన సంసారం ఇది, వీళ్ళ కోసం ఇంత కష్టపడుతున్నాము, వీళ్ళు అసలు సహకరించటం లేదు. ఒక మంచిమాట కూడా వీళ్ళు మన గురించి అనటం లేదే, అని ఒకోసారి రజోగుణం వస్తుంది. ఆచార్యులు వారికి కానీ, భగవాన్‌కి కానీ, వాళ్ళ జీవితంలో ఒక్క సెకను కూడా సత్యం నుంచి కానీ, బ్రహ్మం నుంచి కానీ వారి మనస్సు దూరం జరగదు. వాళ్ళకీ మనస్సు ఉంది, మనస్సు లేకపోతే మనతో ఎలా మాట్లాడుతున్నారు? సమాజం కొంచెం కూడా వాళ్ళ పట్ల కృతజ్ఞత అనేది చూపించనప్పుడు కూడా వాళ్ళ మనస్సు ఎదురు తిరగలేదు. మనం వాళ్ళ మీద నిప్పుల వర్షం కురిపిస్తే, వాళ్ళు మనమీద ప్రేమ వర్షం కురిపించారు. మనము వాళ్ళకి ద్వేషం ఇస్తే తిరిగి వాళ్ళు మనకి ప్రేమని ఇచ్చారు. మేము మిమ్మల్ని ద్వేషిస్తావుంటే మీరు మమ్మల్ని ప్రేమిస్తున్నారు అని ఒక భక్తుడు ఏసుని అడిగాడు.

ద్వేషించేవాడిని ద్వేషిస్తే అందులో విశేషం ఏమీ లేదు, ద్వేషించేవాడిని కూడా ప్రేమిస్తే అది విశేషం కానీ, ద్వేషానికి ద్వేషం ఇస్తే అందులో విశేషం ఏముంది? తల్లి తన పిల్లలని ఆప్యాయంగా చూస్తుంది. భగవంతుడు కూడా అంతే ఆప్యాయంగా తన భక్తులని చూస్తాడని పోల్చి చెప్పటానికి, ఆ పోలిక కూడా సరిపోదు. కానీ ఏదో పోలిక చెప్పాలి కాబట్టి చెపుతున్నారు.

ఈ దేహమే నేను అనుకొని ఏ మాట మాట్లాడినా, ఏ పని చేసినా, ఏ ఆలోచన వచ్చినా, అంతా చెడ్డకే దారి తీస్తుంది. మీరు సత్యాన్ని తెలుసుకోవటం కోసం కృషి చెయ్యటం మానేసి, ఆలోచించటం మానేసి, విషయాన్ని గ్రహించటానికి ప్రయత్నం చెయ్యటం మానేసి, మేము వాళ్లకి ఉపకారం చేసేస్తున్నాము, వీళ్ళకి ఉపకారం చేసేస్తున్నాము, ఇలా మీరు అనుకుంటూవుంటే, మీ ద్వారా ఎవరైతే ఉపకారాలు పొందారో వాళ్ళే పాములై మిమ్మల్ని కరుస్తారు, అది మరిచిపోకండి. మీ వల్ల ఉపకారం పొందిన వాడే, మీ ముఖం మీద మట్టి రాస్తాడు, మీకు శత్రువు అవుతాడు. మీ వల్ల ఎవడైతే ఉపకారం పొందలేదో, వాడికి మీ గొడవే అక్కరలేదు.

రామకృష్ణుడికి కంఠంలో కాన్సర్. మెతుకు లోపలికి వెళ్ళటం లేదు, మజ్జిగ కూడా వెళ్ళటం లేదు! కొంచెం మజ్జిగ కాఫీ లాంటిది ఏదైనా లోపలికి దిగేలా చేసుకోండి; అని వైద్యులు కూడా చేతులు కడిగేసుకున్నారు, ఇంక కష్టం అని. మీకు అమ్మ అంటే ఎక్కువ ఇష్టం కదా, మీ అమ్మని ప్రార్థించకూడదా అని మిగతా భక్తులు అందరూ కలిసి నరేంద్రుడిని అడగమన్నారు. నరేంద్రుడు ఎక్కువ చనువుగా ఉంటాడు కాబట్టి అడగమన్నారు. అప్పుడు రామకృష్ణుడు ఒక మాట చెపుతాడు. "నరేన్, ఈ కాన్సర్ కొంచెం తగ్గించమని, మజ్జిగ కాస్త పుచ్చుకునే అవకాశం ఇవ్వమని అమ్మని అడగమంటున్నావు. నువ్వు చెప్పటం తేలిక, నేను అడగటం కష్టం నరేన్. నువ్వు తేలికగా చెప్పేస్తున్నావు, నేను అడగటం ఎంత కష్టం. ఎందుచేతనంటే అడుగుదామంటే అక్కడ వ్యక్తి కనపడడు. ఇందులో ఉన్న పోరాటం మీకు తెలియదు. వ్యక్తి లోపల ఉండి అడగాలి కదా, లోపల ఉండి అడిగే వ్యక్తి కనపడడు జ్ఞానికి. ఎట్టకేలకు పట్టి పట్టి, తన మనస్సులో బలవంతాన సంకల్పం తెచ్చుకొని, తనకి ఇష్టం ఉన్నా లేకపోయినా, భక్తుల ప్రార్థనని దృష్టిలో పెట్టుకొని తల్లిని మనస్సులో ప్రార్థిస్తాడు. అప్పుడు తల్లి అంటుంది - ఇన్ని నోరుల ద్వారా నువ్వు తింటున్నావు, నీ నోరే తినకపోతే మట్టుకు నష్టం ఏమిటి? ఎన్ని నోరులు తింటున్నాయి అన్నం, నీ నోరే తినాలా అంటుంది. ఇది రామకృష్ణుడికి తెలియదా? రామకృష్ణుడికి తెలుసు. వీళ్ళ బాధ తప్పించుకోవటం కోసం అడిగాడు. ఈ నోరులు అన్నీ తింటున్నాయి కదా, ఎన్ని నోరులు తినటం లేదు అన్నం! ఈ నోరే తినాలా!

అజ్ఞానికి స్వార్థం లేకుండా ఉండటం ఎంత కష్టమో, జ్ఞానికి స్వార్థంగా ఉండటం అంత కష్టం. అజ్ఞాని స్వార్థాన్ని విడిచిపెట్టి ఉండలేడు, జ్ఞాని స్వార్థాన్ని అంటుకోలేడు. సూర్యుడిని అంటిపెట్టుకొని వెలుతురు ఎలా ఉంటుందో, జ్ఞానిని అంటిపెట్టుకొని నిరంతరమూ శాంతి కాంతి అలా ఉంటాయి. ఈ నాటికైనా ఏ నాటికైనా వెళ్ళిపోవటం తప్పదు. ఎంత చిన్న మంచి పనులు చేసినా పేరు శాశ్వతంగా ఉండాలనుకుంటాడు అది అజ్ఞాని లక్షణం. గౌతమ బుద్ధుడికి గుడి లేదు. గౌతమబుద్ధుడిని ఆనంద్ అడిగాడు, నీ శరీరం ఈ రోజున పోయేలా ఉంది, దీనిని దహనం చెయ్యమంటారా, భూమిలో కప్పెట్టమంటారా అని అడిగాడు. బుద్ధుడు కాల్చేయండి ఈ శరీరాన్ని అన్నాడు. ఎక్కడ దహనం చెయ్యమంటారు అని అడిగాడు. అందరినీ ఊరిలో ఏ స్మశానంలో కాలుస్తారో, నా శరీరాన్ని కూడా తీసుకెళ్ళి అక్కడే కాల్చేయండి అన్నాడు. ప్రత్యేకంగా ఒక చోట కాల్చి మీకు సమాధులు అవీ కట్టించవచ్చు అని ఆనంద్ అన్నాడు. అప్పుడు బుద్దుడు, ఎందుకు, దాని వల్ల ప్రయోజనం ఏముంది? నా శరీరంలో ఏదైనా ప్రత్యేకత ఉందా? బుద్ధుడు పోయాక, శరీరాన్ని ఫలానా చోట కాల్చారు అని లోకానికి గుర్తు కూడా అక్కరలేదు అన్నాడు. మానవజాతి మీద అమృతం వర్షింపచేసి, మానవజాతి గుర్తు ఉంచుకోవాలన్న తలంపు కూడా అక్కడ లేదు. అదీ జ్ఞానం యొక్క వైభవం. మానవజాతికి తన జీవితాన్ని ఇచ్చి, మళ్ళీ ఈ జాతి గుర్తుంచుకోవాలి అన్న తలంపు కూడా ఆయనకి లేదు.

గుర్తింపులు కోరుకున్నంత కాలం మీకు ఎన్నడూ జ్ఞానం రాదు. నన్ను క్షమించండి ఇటువంటి కఠినమైన మాటలు చెపుతున్నాను. గుర్తింపులు కావాలనుకున్నంత కాలం ఎవడూ జ్ఞాని అవ్వలేడు. మన ఆలోచన దేహానికే పరిమితం అయిపోతుంది, ఇంక జ్ఞాని ఎలా అవుతారు? ఒకవేళ ఏమైనా పూజలు చేసినా, జపాలు చేసినా, సాధనలు చేసినా, అవి దేహానికే మనస్సుకే పరిమితం; జ్ఞాని ఎలా అవుతారు! ఆ దేహం మీరు కాదు, కానీ దానితో మీరు తాదాత్మ్యం పొందుతున్నారు, ఇంక జ్ఞాని ఎలా అవుతారు? ఏది చేసినా దేహం కోసమే చేస్తున్నారు, మంచీ దాని కోసమే, చెడ్డా దానికోసమే; ఎదుటివాడి మీద కక్ష పెట్టుకున్నా దానికోసమే, ఎదుటివాడిని పొగిడినా దానికోసమే. ఫలానా వ్యక్తిని అని ముందే ఒక నిర్ణయానికి వచ్చేసారు కదా! ఏదో తల్లి కడుపులో పుట్టింది ఆ శరీరం, కానీ ఆత్మ పుట్టలేదు. వాడు ఆ శరీరానికి పరిమితం అయిపోయాడు, ఇంక వాడు జ్ఞాని ఎలా అవుతాడు? అయ్యే అవకాశమే లేదు!

ఎవడైతే చావుని జయించలేదో, వాడికి తప్పనిసరిగా మళ్ళీ చావు వస్తుంది, పుట్టుక

వస్తుంది. శరీరం ఉండగా ఎవడైతే చావుని జయించలేడో వాడికి మళ్ళీ జన్మ వస్తుంది. చనిపోయిన వారిని ఎవరిని చూసి దు:ఖపడవద్దు అన్నారు ఆచార్యులవారు. వీళ్ళందరూ మళ్ళీ తిరిగివచ్చే టికెట్టులే అన్నారు. అంటే తిరిగి పుట్టే జనమే, మళ్ళీ ఈ భూమి మీదకి తిరిగి వచ్చే జనమే, వాళ్ళ గురించి దు:ఖం ఎందుకు అన్నారు. వాళ్ళు చనిపోవటం నిజం అనుకున్నప్పటికీ వాళ్ళ కోసం దు:ఖపడవద్దన్నాడు; మళ్ళీ ఈ సుబ్బారాయుడులందరూ తిరిగి ఈ భూమి మీదకి వచ్చే జనమే! ఒక కులాన్ని ప్రచారం చెయ్యటం కోసమో, మతాన్ని ప్రచారం చెయ్యటం కోసమో నేను ఈ మాటలు చెప్పటం లేదు. జ్ఞాని కష్టాన్ని ఇష్టంగా చేసుకుంటాడు, అజ్ఞాని కష్టాన్ని అయిష్టంగా చేసుకుంటాడు. అందుచేత జ్ఞాని మీద దు:ఖం పడదు, అజ్ఞాని మీద దు:ఖం పడుతుంది. ఈ దేహప్రారబ్ధం తోటి సహకరిస్తే, ఆ ప్రారబ్ధం పోతుంది, కొత్త వాసనలు పుట్టవు, మళ్ళీ జన్మ రాదు. ప్రారబ్ధంతోటి మనం సహకరించము అనుకోండి, ఎదురు తిరుగుతుంది అది, మళ్ళీ కొత్త వాసనలు పుడతాయి, కొత్త జన్మలు వస్తాయి. భగవంతుడి సంకల్పం, మన సంకల్పం కలిసినప్పుడు ఆ పని పూర్తి అయ్యింది అని మనకు అనిపిస్తుంది. మనమే చేసాము అనుకుంటాము. భగవంతుడి సంకల్పం వేరు, మన సంకల్పం వేరు అనుకోండి, అప్పుడు మన సంకల్పం జరగదు, ఆయన సంకల్పమే జరుగుతుంది.

కర్తృత్వం పెట్టుకోవటం వల్ల దు:ఖం వస్తుంది. నేను కర్తని అనుకున్నంత కాలం వాడిని దుఖం వెంటాడుతూనే ఉంటుంది, వాడు ఏ జన్మలో ఉన్నా సరే. కర్తృత్వం లేనివాడికి దు:ఖం పుట్టదు. వైకుంఠం వెళ్తారు అనుకోండి, అక్కడ కూడా దు:ఖం వస్తుంది అనుకోండి మాటవరసకి, ఎందుకు వైకుంఠం మీకు? యదార్ధంగా ఇక్కడ ఆత్మ లేదు అనుకోండి, ఆత్మ నిజం ఎలా అవుతుంది, అక్కడ ఉండి ఇక్కడ లేకపోతే అది అబద్ధం అన్నమాట! మన మనస్సు వైకుంఠం గురించి ఆలోచించటం మానేసి, ఆత్మని తెలుసుకోవటానికి మీ శక్తిని కనుక ఇక్కడ ఉపయోగిస్తే మంచిదని చెప్పటం కోసం చెపుతున్నాను. ఇది మీరు గ్రహించాలి.

అసలు మన మనస్సు ఏంచేస్తుంది; మరణించిన తరువాత ఏమౌతాము అని ఆలోచిస్తాము. ఇప్పుడు మనం జీవించి ఉన్నాము కదా, ఇప్పుడు ఎవరమో మనకి తెలియటం లేదు. మరణించిన తరువాత ఏమౌతామో ఆలోచించమంటుంది మనస్సు. అంటే సమస్యని ఎదుర్కోకుండా తప్పుకుందామని. అంటే అది మనలను దగా చేస్తోంది.

మనం ఎవరినైనా ఏదైనా వస్తువు అడుగుతామనుకోండి, ఉందని చెప్పడు, లేదని చెప్పడు. ఉంటే ఉందని చెప్పాలి లేకపోతే లేదని చెప్పాలి. ఈలోపున ఏంచేస్తాడు అంటే

ఇద్దామా మానదామా అని వాడు ఆలోచించుకుంటూ ఉంటాడు. ఇప్పుడు గడ్డపార అడుగుతాము అనుకోండి, ఉంటే ఉందని చెప్పొచ్చు, లేకపోతే లేదు అని చెప్పొచ్చు. వాడేమంటాడు అంటే గడ్డపార అడిగితే, మీ పిల్లలు బాగున్నారా అంటాడు. పిల్లలకి గడ్డపారకి సంబంధము ఏమిటండీ! అంటే ఈ లోపున కాలాన్ని చంపుతా ఉంటాడు. వాడి దగ్గర గడ్డపార ఉంది; ఇతనికి ఇద్దామా మానేద్దామా అని ఆలోచిస్తా ఉంటాడు అన్నమాట. ఈ గడ్డపార జోలికి పది నిమిషాల దాకా రాడు! మీ అబ్బాయి పాలకొల్లులో చదువుతున్నాడేమోనండీ ఈ మధ్యన అంటాడు. మనం గడ్డపార అడుగుతావుంటే మీ అబ్బాయి పాలకొల్లులో చదువుతున్నాడా అంటాడేమిటండీ! వాళ్ళ క్షేమం వీళ్ళ క్షేమం అడుగుతాడు, ఈ లోపున ఈ పదినిమిషాలు గడ్డపార గురించి వాడు ఆలోచిస్తావుంటాడు. పైకి మన కాలాన్ని చంపాలి కదండీ, మనల్ని ఎంగేజ్ చెయ్యాలి కదా అక్కడ!

అసలు ఎప్పుడూ కూడా మనం ఎదుటి మనిషి ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు వాడు తెలివైన వాడు అనుకొనే మాట్లాడాలి. వాడు తెలివితక్కువ వాడు అయినా పరవాలేదు, వాడు తెలివైన వాడు అనుకొని మాట్లాడితే మనకే మంచిది. ఎదుటి మనిషితో మాట్లాడేటప్పుడు, ఆడవాళ్ళతో మాట్లాడినా మగవాళ్ళతో మాట్లాడినా, వాళ్ళు తెలివైనవాళ్ళు అనుకొనే మనం మాట్లాడాలి. వాళ్ళు నిజంగా తెలివితక్కువ వాళ్ళు అయినా మనకి నష్టం లేదు. వాళ్ళు తెలివితక్కువ వాళ్ళు అనుకొని మాట్లాడతాము అనుకోండి, నిజంగా వాళ్ళు తెలివైన వాళ్ళు అనుకోండి, మనం ప్రమాదంలో పడతాము.

ఇప్పుడు మనం అందరమూ ఇక్కడ కూర్చున్నాము. ఈ కాలాన్ని సద్వినియోగం చెయ్యనివ్వకుండా, భవిష్యత్తు కాలం గురించి ఆలోచించమంటుంది మనస్సు! భవిష్యత్తు కాలం అబద్ధం! కొంతమంది జరిగిపోయిన గొడవల గురించి బెంగపెట్టుకుంటారు. ఏదైనా జరిగిపోయిన గొడవల గురించి మీరు బెంగ పెట్టుకుంటా ఉంటే అవి మీకు జ్ఞాపకం వచ్చి మీకు దు:ఖం వస్తోంది. జరిగిపోయిన గొడవలు అంటే, ఏదో ఒక రోజున ఆ సంఘటన జరిగింది, అది మీకు జ్ఞాపకం వచ్చి దు:ఖం వస్తోంది. కాలమే అబద్ధం అయినప్పుడు ఇంక మీకు దు:ఖం ఎందుకండీ?

మన మనస్సు వైకుంఠం గురించి ఆలోచిస్తుంది. ఈ పూజ చేద్దాము, ఈ పుణ్యం చేద్దాము, వైకుంఠం వస్తుంది అని ఆలోచిస్తుంది. అంటే ఏమిటి, ఇక్కడ సబ్జక్టుని, సమస్యని వదిలేస్తోంది. ఇక్కడ యదార్ధంగా హృదయంలో ప్రకాశిస్తున్న వస్తువుని వదిలేస్తోంది, అబద్ధం కోసం పరుగుపెడుతోంది. పోనీ ఈ మనస్సు వైకుంఠం గురించి ఆలోచిస్తుంది, వీడు

మరణిస్తాడు నిజంగా వైకుంఠానికి వెడతాడు, ఎంతకాలం ఉంటాడు అక్కడ; అది నిజం కాదు కదా అక్కడ ఉండటానికి వీడు! తన మూలాన్ని వెదకటం మానేసి, తన మూలంలోకి వెళ్ళితే తన అస్థిత్వం పోతుందని, తను కల్పించిన గొడవల దగ్గరకి తీసుకెళ్తుంది ఈ మనస్సు.

మనకి ఒక్కోసారి మంచి కలలు వస్తాయి, అది వైకుంఠం అనుకుందాము; ఒక్కోసారి చెడ్డ కలలు వస్తాయి, అవి నరకం అనుకుందాము. ఎంత మంచి కల అయినా గంటా రెండు గంటలు ఉంటుంది వెళ్ళిపోతుంది రెండూ అబద్దమే. చెడ్డ కల అయినా అంతే కదా, గంటో రెండు గంటలో ఉండి వెళ్ళిపోతుంది. అబద్ధం ఎంతసేపు ఉంటుంది! ఈ అబద్ధాన్నే పట్టుకొని మనం వేలాడతాము అనుకోండి, అబద్ధాన్ని నిజం చెయ్యగలమా? పోనీ ఒక పని చేద్దాము! ఆత్మని వదిలేద్దాము; ఇదే నిజం అనుకుందాము. ఈ అబద్ధాన్ని ఇది నిజం ఇది నిజం అని ఒక మంత్రంలా జపించినా ఇది నిజం అవుతుందా?

నిజం కాని దాంట్లోంచి మీకు సుఖం ఎలా వస్తుంది? అసలు ప్రతీ ఆదివారం మీరందరూ వచ్చి ఎందుకు కూర్చుంటున్నారు ఇక్కడ? ఈ కళ్ళజోడు ఉంది, మీరు కళ్ళజోడు కొనటానికి మీరు ఎంత కష్టపడుతున్నారో అంత కష్టం కూడా అక్కరలేదు ఇక్కడ. అటువంటి పనిముట్లు కూడా దీనికి అక్కరలేదు. ఏదైనా పనికి మనం పనిముట్లు కూడా తెచ్చుకోమంటున్నాము, సామానులు తెచ్చుకోమంటున్నాము ఇంటి దగ్గర నుంచి. అజ్ఞానాన్ని కొయ్యటానికి చాకుతోటి కూడా పని లేదు. దీనికి వందరూపాయల ఖర్చు కూడా లేదు. రేపటి గురించి ఆలోచిస్తారు ఏంటి మీరు? ఈ రోజు వదిలేసి, ఈ రోజున మీరు చేసుకునే కార్యక్రమం వదిలేసి, రేపటి గురించి ఆలోచిస్తారు. పోనీ రేపు వస్తుంది, ఎలా ఉంటుంది, రేపు ఏమైనా గొప్పగా ఉంటుందా? రేపూ ఇలాగే ఉంటుంది! ఇది మనస్సు చేసే గారడీ!

ఫలానా రోజున పుట్టాను, ఫలానా రోజున చచ్చిపోతాను అనుకొంటే వాడు జ్ఞాని అవ్వలేడు. పుట్టింది ఎవడు, చచ్చిపోయేవాడు ఎవడు? ఆత్మ పుట్టిందా, ఆత్మ చచ్చిపోతుందా? ఇది ఎలా ఉంటుంది అంటే, భగవాన్ దగ్గరికి ఒక పంతులు గారు వచ్చారు. మీ రంగూ నా రంగూ ఒకటే అన్నారు భగవానుతో ఆ పంతులు గారు. సరి సరి అన్నారు భగవాన్. నీ వయస్సు నా వయస్సు ఒకటే అన్నారు పంతులుగారు, సరి సరి అన్నారు భగవాన్. నువ్వూ నేను ఒకే గ్రామంలో పుట్టాము అన్నారు, భగవాన్ సరి సరి అన్నారు. మీరు బ్రాహ్మణులే మేమూ బ్రాహ్మణులమే అన్నారు, సరి సరి అన్నారు భగవాన్. మీ ఇంటిపేరు మా ఇంటిపేరు ఒకటే అన్నారు ఆ పంతులు గారు, సరి సరి అన్నారు భగవాన్. అప్పుడు భగవాన్ అన్నారు,

మీరు చెప్పేవి అన్నీ పూర్తి అయిపోయాయా ఇంకేమైనా చెపుతారా? ఒకటే గోత్రం అన్నారు, అన్నీ చెప్పుకొచ్చారు. మీరు చెప్పేవి అన్నీ పూర్తి అయిపోయాయా అంటే, అన్నీ పూర్తి అయిపోయాయి అన్నారు పంతులుగారు. అన్నీ చెప్పారు, ఒకటి మరిచిపోయారు, మీలోని నాలోని ఒకటే ఆత్మ ఉంది, అది మరిచిపోయారు. పనికిరాని గొడవలు అవసరంలేని గొడవలు అన్నీ చెప్పారు పంతులుగారు, నీ రంగూ నా రంగూ ఒకటే అన్నారు, రంగు ఏమిటండీ! ఈ పనికిరాని గొడవలు అన్నీ చెప్పారు. మీరు ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి, అవి చెప్పినప్పుడు కూడా ఇది జ్ఞాపకం ఉంచుకోండి.  ఉన్నది ఒక్కటే, అదే ఆత్మ.  ఇక్కడ భగవాన్ ఏమీ రియాక్ట్ అవ్వలేదు. అది జ్ఞాని గొప్పతనం. ఏంటి ఇటువంటి మాటలు చెపుతున్నావు అని చీదరించుకోలేదు. నువ్వు అన్నీ చెప్పావు, కానీ ఒకటి మరిచిపోయావు. నీలోనీ నాలోనీ ఒకటే ఆత్మ ఉంది. ఆత్మని మీరు తెలుసుకొని, లోకంలో విద్యలు మీరు నేర్చుకున్నా పరవాలేదు. కాని ఆత్మని వదిలేసి లోకంలో మీరు ఎన్ని విద్యలు నేర్చుకున్నా అవి ఒకటి లేని సున్నలుతో సమానం.

వడ్రంగి పని చేసేవాడికి మనం రోజుకు ఇరవై రూపాయలు ఇస్తాము, పోనీ చదువుకొని కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం చేసేవాడు రోజుకి వంద రూపాయలు తెచ్చుకుంటాడు. వాడూ పని చేసుకుంటాడు, వీడూ పని చేసుకుంటాడు. పైగా వాడికి అదనంగా గర్వం, నేను లెక్చరర్ చేస్తున్నాను, రోజుకి వంద రూపాయలు తెచ్చుకొంటున్నాను అని! అదొకటి పాడుచేస్తుంది వాడిని. వాడు చేసేదీ కూలి పనే! అదీ లేబరే, దానిని ఎడ్యుకేటేడ్ లేబర్ అంటారు. చదువుకున్న లేబర్. ఆ వంద రూపాయలు కూడా వాడు కష్టపడితేనే ఇస్తున్నారు, లేకపోతే ఊరికే ఇవ్వరు కదా! అయినా వడ్రంగి పని చేసేవాడు తక్కువ, నేను ఎక్కువ అనుకుంటాడు. కానీ వాడుకూడా లేబర్ అన్న సంగతి వాడికి తెలియదు.

కాలువ అవతలకి వెళ్ళాలి అనుకోండి ఇక్కడ కూర్చున్నవాళ్ళు, వంతెన వచ్చాక దాటతారా, ఇక్కడే దాటేస్తారా? అది రానివ్వండి, అక్కడిదాకా నడిచివెళ్ళిన తరువాత, వంతెన వచ్చిన తరువాత దాటదాము. అసలు రేపు అనే రోజు రానివ్వండి అప్పుడు చూద్దాము. ఈరోజు వదిలేసి, రేపటి రోజు ఏంటి? వంతెన దగ్గరికి వెళ్ళిన తరువాత వంతెన దాటతాము. ఇక్కడే దాటేస్తారా?  రేపు రాబోయే కష్టానికి కూడా ఇప్పటినుంచీ కంగారు పడతావుంటారు. ఒకోసారి ఆ అనుకున్న కష్టం అసలు రానేరాదు! మీరు పది రోజుల తరువాత ఏదో కష్టం వస్తుందని ఇప్పటినుంచీ ఊహిస్తూవుంటారు, ఇప్పటినుంచీ కష్టపడిపోతా ఉంటారు. తీరా ఆ రోజు వచ్చేసరికి అది రానేరాదు!

ఈ లోకంలో ఉన్న చదువులు అన్నీ నిజం అనుకుందాము, ఇప్పుడు వాదన కోసం నిజం అనుకుందాము. మరి నిజమైతే లోపల ఉన్న అజ్ఞానం ఎందుకు పోవటం లేదు. ఐదు ఐదు కలిపితే పది, పదిలోంచి ఐదు తీసేస్తే ఐదు; ఇటువంటివి అన్నీ నేర్చుకున్నాము, లోకానికి సంబంధించిన విద్యలన్నీ నేర్చుకున్నాము. మరి ఆ విద్యలే కనుక నిజమైతే లోపల ఉన్న అవిద్య ఎందుకు పోవటం లేదు? మనం తీసుకునే మందుకి లోపల రోగానికి సంబంధం ఉంటే, ఈ మందు వల్ల రోగం పోవాలి కదా! రోగం తగ్గటం లేదు అంటే మనం తీసుకొనే మందు ఈ రోగానికి సంబంధించిన మందు కాదన్న మాట! లోకంలో ఉన్న విద్యలన్నీ నిజమైన విద్యలైతే లోపల ఉన్న అజ్ఞానం ఎందుకు పోవటం లేదు?

నేను చెప్పానని ఏ మాటలూ మీరు నమ్మొద్దు, మీ అంతట మీరు ఆలోచించుకోండి. మీరు ఆలోచించుకోకుండా, నేను చెప్పానని మీరు నమ్ముతారు అనుకోండి, మీకు వంటపట్టవు. రేపు సాయంత్రానికి మీరు మరిచిపోతారు. మీరు ఆలోచించుకుంటారు అనుకోండి, మీకు అర్థం అవుతుంది అనుకోండి మీ హృదయంలో, మీకు జ్ఞాపకం ఉంటాయి. జ్ఞాపకం ఉంటే అది మీరు అవుతారు.

రామతీర్థ కాలేజీ లెక్చరరుగా చేస్తున్న రోజులలో, వివేకానంద స్వామి ఆయన దగ్గరికి వచ్చాడు. అప్పుడే మొదటి జీతం ఏదో పెట్టుకొని రిస్ట్ వాచ్ కొనుక్కుంటాడు రామతీర్థ. ఆయన మొట్టమొదటి జీతంతో కొనుక్కున్న ఈ రిస్ట్ వాచీ తీసి ఈయనకి చూపిస్తాడు. చాలా బావుంది, ఎక్కడ కొన్నారు అంటాడు, ఏ షాపులో కొన్నారు ఇంత మంచి వాచీ అని చూసి తిరిగి ఆయనకి ఇచ్చేసాడు వివేకానంద. అది నీకు బహుమతిగా ఇచ్చాను అన్నాడు రామతీర్థ. నాకు ఇచ్చేసారు, మీ చేతిమీద దాచుకుంటున్నాను. మీ చేతికే పెట్టుకోండి, నాదే గడియారం. పోనీ నాది అనుకునే మీ చేతికి పెట్టుకోండి.

వివేకానంద ఉపన్యాసాలకి అమెరికాలో విపరీతంగా జనం వచ్చేవారు. రామతీర్థ ఉపన్యాసాలకి చాలా తక్కువమంది వచ్చేవారు జనం. వివేకానంద మరణించిన తరువాత రామతీర్థ అమెరికా వెళ్ళాడు. అప్పుడు ఒకరు అడిగారు, మీరు ఇద్దరూ మా దేశం వచ్చారు, ఆయనకి విపరీతంగా జనం వచ్చేవారు, మీకు చాలా తక్కువమంది వస్తున్నారు ఏమిటి? అప్పుడు రామతీర్థ చెప్పారు, ఆయన (వివేకానంద) బంగారం కావలసిన వాళ్లకి బంగారం ఇవ్వగలడు, వంకాయలు కావలసిన వాళ్లకి వంకాయలు ఇవ్వగలడు, ఏది కావలసిన వాళ్లకి అది ఇవ్వగలడు, నేను బంగారం ఒక్కటే ఇవ్వగలను, వంకాయలు అవి ఇవ్వలేను అన్నారు. ఆయన బంగారం ఇవ్వగలడు, కానీ నాకు బంగారం వద్దు వంకాయ కావాలి

అంటే, వంకాయ ఇచ్చి పంపేయగలడు. కానీ నాకు అలా చేతకాదు, ఒక్క బంగారమే ఇవ్వగలను అని చెప్పాడు.

ఎవరైతే మేము సుఖపడాలి, సుఖపడాలి, అనుకొంటున్నారో, వాళ్ళందరికీ సుఖం దొరకదు. సుఖాన్ని మరిచిపోయిన వాళ్ళనే సుఖం వరిస్తుంది. నాకు సుఖం కావాలి, నాకు సుఖం కావాలి, అనుకొన్న వాళ్ళకి ఎవరికీ సుఖం రాదు. సుఖాన్ని మరిచిపోతే వాళ్ళు సుఖపడతారు. మందు ఇది, ఈ సుఖం అనే రెండు అక్షరాలూ మరిచిపోండి, మీరు సుఖపడతారు. నాకు సుఖం కావాలి, నాకు సుఖం కావాలి, అని మంత్రం చేసే బదులు ఆ రెండు అక్షరాలూ మరిచిపోండి! తల్లితండ్రులు చూడండి, కొంతమంది ఎలా ఉంటారు అంటే, వారికి నలుగురు పిల్లలు ఉన్నారు అనుకోండి అందులో డబ్బు లేని పిల్లలకి ఒక రూపాయి ఇద్దాము అని వాళ్లకి ఉండదు, ఉన్న వాళ్ళకే మళ్ళీ ఇస్తా ఉంటారు. అదే ప్రకృతి. అంచేత మీరందరూ సుఖపడదాము అనుకుంటే, ఆ రెండు అక్షరాలూ మరిచిపోండి, మీ డిక్షనరీ లోంచి తీసేయండి. సుఖం అనే రెండు అక్షరాలూ మరిచిపోతే మీరు సుఖపడతారు. అవి అస్తమానూ జ్ఞాపకం వస్తావుంటే మీకు సుఖం దూరం అయిపోతుంది. ఇది మంత్రం - రాసుకోండి.

ఓం శాంతి శాంతి శాంతి - శాంతి లేని మనిషి కానీ, శాంతి లేని దేశం కానీ, శాంతి లేని ప్రపంచం కానీ, ఎంతోకాలం నిలబడదు. శాంతి లేని మనిషి నిలబడడు, శాంతి లేని ఊరూ నిలబడదు, శాంతి లేని దేశం నిలబడదు, శాంతి లేని ప్రపంచం కూడా భగ్గున మండిపోయి కాలిపోతుంది. ఎలా కాలిపోతుంది అంటే, తిరిగి బాగుచేసుకుందాము అనటానికి వీలు లేకుండా కాలిపోతుంది. అంటే రేడియో పోతే మళ్ళీ మరమ్మత్తు చేయించుకోవచ్చు. శాంతి లేని ప్రపంచం ఎలా కాలిపోతుంది అంటే, తిరిగి మరమ్మత్తు చేసుకోవటానికి వీలు లేకుండా కాలిపోతుంది.

మీకు అన్నీ ఉన్నాయి, మీ హృదయంలో శాంతి లేదు అనుకోండి ఇంక ఏమి సుఖపడతారు? ఏంచేస్తారు, ఏమౌతుంది? మీ దేవుళ్ళు ఏమౌతారు? ఎంతమంది దేవతలు ఉంటే ఏంటి, మీకు శాంతి లేకపోతే? ఈ లోకంలో శాంతి లేని మనుషులు నిలబడరు, శాంతి లేని మానవజాతికి నాశనమే గతి.

ఓం శాంతి: శాంతి: శాంతి:!



# రామకృష్ణ పరమహంస

**రామకృష్ణ పరమహంస గారిలో ఉన్న విశేషం ఏమిటంటే, కపటం అనేది ఎలా ఉంటుందో తెలియదు, రెండు లౌకికం తెలియదు. ఆ రెండింటి వల్లే నేను ఆయనకి ఆకర్షింపబడ్డాను అంటారు శ్రీనాన్నగారు. ఫిబ్రవరి నెల రామకృష్ణ జయంతి సందర్భంగా రామకృష్ణుడు గురించి శ్రీ నాన్నగారి మాటలలో .....**

రామకృష్ణుడి తండ్రి తీర్థయాత్రకి గయ వెళ్ళాడు, గదాధరుడి గుడిలో రాత్రి స్వప్నంలో కనిపించి నేను మీ ఇంటికి వస్తాను అన్నాడు మహావిష్ణువు. అప్పుడు రామకృష్ణుడి తండ్రి, నేను పేదవాడిని, నిన్ను పోషించలేను, అంచేత నువ్వు మా ఇంటికి రావద్దు అన్నాడు. భగవంతుడు వస్తాను అంటే రావద్దు అని చెప్పాడు. నీలో ఉన్న ప్యూరిటీ వల్లే నేను మీ ఇంటిలో జన్మిస్తాను, నేను ధనవంతుల ఇంటికి వెళ్ళను అన్నాడు. రావద్దు అన్నా వచ్చేసాడు, వాడే రామకృష్ణుడు. రామకృష్ణుడి తల్లితండ్రులు పరమపవిత్రులు. అవసరమైతే డబ్బు పోవటానికి ఒప్పుకుంటారు కానీ అబద్ధం మట్టుకు చెప్పరు. అంత పవిత్రులు. పరమపవిత్రులకి కానీ ఆత్మజ్ఞానం కలగదు.

రామకృష్ణుడు చెప్పిన ఒక వాక్యం నన్ను బంధించింది, నా మనస్సును తేలిక పరిచింది అన్నారు నాన్నగారు. ఈశ్వరుడు మాత్రమే కర్త; కాని మానవుడు నేను కర్తని అనుకొంటున్నాడు కాబట్టి వాడికి దు:ఖం వస్తోంది. కర్త ఈశ్వరుడే, నేను ఎంతమాత్రమూ కర్తను కాదు అని నోటితో చెప్పటం, మనస్సుతో స్మరించటం కాదు, ఈ వాక్యాన్ని నీ హృదయంలో అనుభవించినప్పుడు జీవన్ముక్తుడవు అవుతావు అన్నాడు రామకృష్ణుడు. దు:ఖానికి కారణం కర్తృత్వం. ఒక మనిషికి దు:ఖం వస్తోంది అంటే అక్కడ కర్తృత్వం ఉండి తీరాలి. కర్తృత్వం లేని వాడికి దు:ఖం లేదు.

రామకృష్ణ పరమహంస గారికి చదువు లేకపోయినా, ఆయన మాట్లాడే మాటలో మనకు ఎక్కడా కపటం కనపడదు. అసలు లౌఖ్యం ఎలా ఉంటుందో తెలియదు ఆయనకి. అదే నా ఇష్టానికి కారణం, అంటారు శ్రీనాన్నగారు. నువ్వు ఏదైనా చెడు మార్గంలో ఉంటే, ఆ

చెడు మార్గం లోంచి నిన్ను ఎలా విడుదల చెయ్యాలి అని చూసుకునేవాడు కానీ ఎప్పుడూ నిన్ను విమర్శించేవాడు కాదు. పైగా నిన్ను ఎక్కువగా దగ్గరకి చేరదీసేవాడు.

రామకృష్ణుడిని పరమహంస అన్నారు. పరమహంస అంటే, హంసలు పూర్వం హిమాలయ పర్వతాలలో ఉండేవి. మీరు పాలు నీళ్ళు కలిపేసి ఒక గ్లాసులో అక్కడ పెడితే, హంస పాలు తాగి నీళ్ళు వదిలేస్తుంది. అలాగే మంచిని తీసుకొని చెడ్డని వదిలేసేవాడు. లోకంలో మంచి చెడ్డలు రెండూ ఉంటాయి. మనం మంచి తీసుకొని చెడ్డ వదిలేస్తూ ఉండాలి. అలా చేసాడు కాబట్టే రామకృష్ణుడికి 'రామకృష్ణ పరమహంస' అనే పేరు వచ్చింది. ఎక్కడన్నా వివేకం ఉంటే తీసుకుంటాడు, అవివేకం ఉంటే వదిలేస్తాడు.

మీరు ఎంత చదువుకున్నా మీకు ఎంత సంపద ఉన్నా, వైరాగ్యం లేని వాడి మనస్సు అసలు అంతర్ముఖం అవ్వదు. వైరాగ్యానికి ప్రతిరూపం రామకృష్ణుడు. నేను, నాది - ఆ రెండూ మనం భూతద్దంలో చూసినా మనకి రామకృష్ణుడిలో కనపడవు.

ఎన్ని సిద్ధులు ఉన్నా, నీకు జ్ఞానం లేకపోతే నీ పని సున్నా. రామకృష్ణుడితో ఒకరు నేను పది సంవత్సరాలు కష్టపడి నీటి మీద నడవటం నేర్చుకున్నాను అని చెప్పాడు. నీవు పది సంవత్సరాలు నేర్చుకున్న విద్య ఒక అణా విలువ, మేము ఒక అణా ఇస్తే పడవ మీద నదిని దాటిస్తారు అన్నాడు రామకృష్ణుడు. సిద్ధులు అశుద్ధంతో సమానం, వాటి జోలికి వెళ్ళకండి, బ్రహ్మానుభవం పొందటం కోసం ప్రయత్నం చేయండి అని రామకృష్ణుడు చెప్పాడు. నీ హృదయంలో ఈశ్వరుడు నివాసం ఉన్నాడు, ఆయన కోసం తపిస్తే నీకు జ్ఞానం వస్తుంది, సిద్దులు వస్తాయి. జ్ఞానం వచ్చిన తరువాత మీకు సిద్ధులు వస్తే పరవాలేదు. జ్ఞానం రాకుండా సిద్ధులు వస్తే మీరు మాయలో పడతారు. మీ సిద్దులే మిమ్మల్ని పాడుచేస్తాయి. మీకు భగవంతుడిపట్ల నిజమైన ప్రేమ కలిగితే సిద్ధులు కావాలనే సంకల్పం కూడా ఉదయించదు. సిద్ధులు ప్రదర్శించే శక్తి వలన మీ మనస్సు బలపడుతుంది, దేహాభిమానం పెరిగిపోతుంది.

రామకృష్ణుడి గురించి ఆయన భక్తులు చదివే ముఖ్యమైన గ్రంథాలు రెండు. 1) రామకృష్ణ ది గ్రేట్ మాస్టర్ - అది శారదానంద రాసాడు. 2) గోస్పెల్ అఫ్ శ్రీరామకృష్ణ - అది మహేంద్రనాథ్ గుప్త వ్రాసాడు.

మహేంద్ర నాథ్ గుప్త మొదటిసారి రామకృష్ణుడిని చూడటానికి వచ్చినప్పుడు అక్కడ

**మాకు శాంతి లేదు అని చాలామంది అంటారు. మీకు మమకారం ఉన్నప్పుడు, అహంకారం ఉన్నప్పుడు, శాంతి దొరకదు అని పరమాత్మ గీతలో చెప్పాడు.**

ఉన్న పనిమనిషిని మీ గురువుగారికి చదువు లేదు, సంతకం పెట్టటం కూడా రాదంట, కాని ఇక్కడికి వచ్చిన వారికి శాస్త్రం చెబుతాడట, ఎలా చెబుతున్నాడు అని అడిగాడు. విద్యాస్వరూపుడికి విద్య నేర్చుకోవటం ఎందుకు? మా గురువుగారి కంఠంలో మొత్తం విద్యలు అన్నీ ఉన్నాయి, ఇంక ఆయనకి కాలేజీ చదువులు ఎందుకు? ఇది ఒక పనిమనిషి మహేంద్రనాథ్ గుప్తకు చెప్పిన సమాధానం.

రామకృష్ణుడి మాటలను "M" డైరీలో రాసుకొనేవాడు, అందులో ఒక వాక్యం చెబుతాను చూడండి అన్నారు నాన్నగారు. రామకృష్ణుడిని ఎవరో నేను గురించి అడిగారు. రామకృష్ణుడు చెప్పిన సమాధానం అపూర్వం, ఉపనిషత్తులలో లేని అందం! ఈ చదువు రాని బ్రాహ్మణుడు, పల్లెటూరిలో పుట్టిపెరిగిన పూజారి, ఇక్కడ ఒక క్లూ వండర్ఫుల్ గా చెప్పాడు. నేను ఎలా పోతుంది అని ప్రశ్న; దీనికి రకరకాలుగా రమణమహర్షి చెప్పారు, ఉపనిషత్తులు చెప్పాయి. ఇక్కడ రామకృష్ణుడు నువ్వు విచారణ చెయ్యి, జపం చెయ్యి, ధ్యానం చెయ్యి అలా చెప్పలేదు. నువ్వు ఎలా బ్రతుకుతున్నావు అన్నాడు; నేనుగానే బ్రతుకుతున్నాను అన్నాడు. నేనుగా బ్రతుకుతూ ఉంటే నేను ఎలా పోతుంది అన్నాడు. నేనుగా బ్రతకటం మానేయి, దాన్ని నీవు పొమ్మనక్కరలేదు, దానంతట అదే పోతుంది అన్నాడు. అదీ రామకృష్ణుడి టీచింగ్! ఆ వాక్యంలో ఉన్న సౌందర్యం చూడండి. ఆయన పండితుడు కాదు కాబట్టి ఇంత అందంగా చెప్పగలిగాడు. పండితుడు అలా చెప్పలేడు, ఆ ఉపనిషత్తులో అలా ఉంది ఈ ఉపనిషత్తులో ఇలా ఉంది అంటూ చెప్తాడు. వాడికి అనుభవం ఉండదు కదా. పుస్తకాలు చదివి చెప్పటానికి రామకృష్ణుడికి చదువులేదు కదా. ఏదైతే చెపుతున్నాడో అది దర్శించి చెపుతాడు. నువ్వు నేనుగా బ్రతికితే నేను ఎలా పోతుంది, నీ జీవిత విధానం మార్చుకుంటే, నేనుగా బ్రతకటం మానేస్తే, అది సహజంగా పోతుంది. నీకు డబ్బులు ఉన్నాయని, చదువు, పాండిత్యం, అధికారం, గౌరవం ఉన్నాయని, వాటివల్ల పోదు. బాహ్యప్రక్రియల వల్ల పోదు, ఏదో చేస్తే అది పోదు. నువ్వు నేనుగా జీవించటం మానేయి, అది నీకు కనిపించకుండా పోతుంది.

జ్ఞానం అంటే ఏమిటి అని బంకించంద్ర చటర్జీ ఒక్క వాక్యంలో చెప్పమంటే, "ఇప్పుడు ఏదైతే నువ్వు, నేను నేను అంటున్నావో ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం" అని చెప్పారు రామకృష్ణుడు. ప్రతీ మనిషి నేను నేను అంటాడు. ఆ నేను నూటికి నూరుపాళ్ళు అబద్దం. అయినా నీలో ఉన్న అజ్ఞానం వలన అది నిజం అనుకొంటున్నావు. ఆ నేను ఉన్నంతకాలం నువ్వు చీకటిలో ఉంటావు. తప్పులు చేయకుండా ఉండలేవు. ఇప్పుడు నువ్వు ఏదైతే నేను నేను అంటున్నావో ఆ నేను, నేను కాదని తెలిసినప్పుడే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది కాని, ఈలోపుగా నువ్వు ఎన్ని ప్రక్రియలు చేసినా, ఎన్ని మహిమలు చేసినా

నీకు ఆత్మజ్ఞానం కలగదు అన్నాడు రామకృష్ణుడు.

రామకృష్ణుడు వాసనల గురించి మాట్లాడటమే కాదు, ఆ వాసనలను సర్జరీ చేసి తీసేసేవాడు. ఆ వాసనలు తొలిగించకపోతే వాటితో బాధపడుతూ నా పని మీరు చెయ్యలేరు కాబట్టి వాటిని లాగేసేవాడు. నీ బంధాలని తొలగిస్తాను అంటే వాటిని లాగిపడేయటమే. ఆ శక్తి ఆయనకి త్రికరణశుద్ధి వలన వచ్చింది.


ఆయన పవిత్రతకి ఎక్కువ విలువ ఇచ్చేవారు. నేను ఈ ప్రపంచాన్ని స్వప్నంలో కూడా ఎప్పుడూ ఎంజాయ్ చెయ్యలేదు అన్నాడు రామకృష్ణుడు. జాగ్రదవస్థలోనే కాదు, స్వప్నంలో కూడా నేను ఈ లోకాన్ని ఎంజాయ్ చెయ్యలేదు అన్నాడు. వాడు రామకృష్ణుడు!

రామకృష్ణుడు ఇంకో రెండు రోజులకు శరీరం విడిచిపెడతాడు అనగా నరేంద్రుడిని దగ్గరకు పిలిచి నువ్వు ఈ ప్రపంచానికి బోధించటానికే పుట్టావు అంటాడు. అప్పుడు నరేంద్రుడు నాకు ఈ గొడవలు ఏమీ వద్దు, నేను తరిస్తే సరిపోతుంది అంటాడు. నరేన్ నువ్వు నా పనికోసం ఈ భూమి మీదకు వచ్చావు. నేను తరిస్తే సరిపోతుంది అంటున్నావు. అంటే నువ్వు అంత చిన్నవాడివా, అంత కురచగా ఆలోచిస్తావా, నేను బోధించను అంటున్నావు, కాని నీ ఎముకలు ఈ ప్రపంచమంతా తిరిగి బోధిస్తాయి, అంటాడు రామకృష్ణుడు.

ఆయనకి మనుషుల మీద హద్దులులేని ప్రేమ. మానవజాతి మీద విపరీతమైన ప్రేమ. అది అన్ కండిషనల్ లవ్, ప్యూర్ లవ్. ప్రేమించటం కోసమే ప్రేమ కాని, వ్యాపార ప్రేమ కాదు. షరతులు లేని ప్రేమ. ప్రతిఫలం ఏమీ కాంక్షించకుండా, కేవలం అవుట్ అఫ్ లవ్, అవుట్ అఫ్ కంపాషన్, దయ వల్ల ప్రేమ వల్ల - ఆయన ఏ స్థితి అయితే పొందాడో, ఆ స్థితిలోకి నిన్ను తీసుకెళ్లటానికి టీచింగ్ చెప్పటమే కాని మరొక ఉద్దేశం అక్కడ లేదు.

రామకృష్ణుడు అవతారపురుషుడు కాదు, అవతార వరిష్టుడు. ఆయన బోధస్వరూపుడు, కరుణాస్వరూపుడు, దయాస్వరూపుడు, ప్రేమస్వరూపుడు. రామకృష్ణ పరమహంస మాటలు చెప్పాడు అంటే అక్కడ పరమేశ్వరుడే ఆ రూపం ధరించి చెపుతున్నాడు. వారి పట్ల గౌరవం లేకుండా ప్రేమ లేకుండా, వారి పట్ల అంకితభావం లేకుండా, ఎంతోకొంత వారిపట్ల భక్తి లేకుండా వారు చెప్పిన మాటల మీద మనకి విశ్వాసం కలుగదు.

**భగవద్గీత కృష్ణుడు చెప్పాడు, వ్యాసుడు రాసాడు, అర్జునుడు విన్నాడు. అయితే భగవద్గీత మనం చదువుకుంటే అర్థం అవ్వదు. భగవద్గీత చదివే వాళ్లకి సహృదయం ఉండాలి, సద్బుద్ధి ఉండాలి. మంచి ప్రవర్తన ఉంటే కానీ భగవద్గీత తన హృదయం మనకి ఇవ్వదు.**



# అరుణాచల మహాత్మ్యం
# అక్షరమణమాల

**అళగు సుందరముల వలె చేరి**
**నేను నీవుంద మభిన్నమై యరుణాచలా!**

తాత్పర్యము: అందం - అందం కలిసిపోయినట్లు (నా తల్లి అళగమ్మ నా తండ్రి సుందరమయ్యర్ కలిసిమెలిసి అన్యోన్యంగా జీవించినట్లు) మనమిరువురము “నీవు-నేను” అను భేదం లేకుండా కలిసిపోయి ఒకటిగా ఉందాము అరుణాచలా!

నువ్వే నాకు దిక్కు అరుణాచలేశ్వరుడా, నువ్వే నాకు చుట్టం అరుణాచలేశ్వరుడా, నువ్వే నాకు దైవం అరుణాచలేశ్వరుడా, నువ్వే నాకు తల్లి అరుణాచలేశ్వరుడా, నువ్వే నాకు తండ్రి అరుణాచలేశ్వరుడా. ఓ అరుణాచలేశ్వరుడా, ఎందుకు వేరుగా ఉండటం, కలిసిపోయి ఉందాము. పాలులో పాలు కలిసిపోతే ఇంక వేరుతనము ఉండదు. నీటిలో నీరు కలిసిపోతే వేరుతనము ఉండదు. అదేవిధంగా, మా అమ్మ అళగమ్మ అంటే సౌందర్యం, మా తండ్రి సుందరమయ్యర్ అంటే సౌందర్యం. అందం అందం కలిసిపోతే ఎలా ఉంటుందో, పాలూ పాలూ కలిసిపోతే ఎలా ఉంటుందో, నీరూ నీరూ కలిసిపోతే ఎలా ఉంటుందో, ఓ అరుణాచలేశ్వరుడా నువ్వూ నేనూ అలా కలిసిపోయి ఉందాము అరుణాచలేశ్వరుడా. మనిద్దరికీ వేరు కాపురం వద్దు అరుణాచలేశ్వరుడా. లోపల ఉన్న వస్తువు ఒకటే అరుణాచలేశ్వరుడా. అంచేత నీకూ నాకూ ఇంక బేధం లేదు. అళగమ్మ, సుందరమయ్యర్ ఎంత అన్యోన్యంగా ఎంత ఐకమత్యంగా ఎంత అందంగా వాళ్ళిద్దరూ సంసారం చేసారో, అదేవిధంగా నువ్వూ నేను కలిసిపోయి ఉందాము అరుణాచలేశ్వరుడా!

రమణస్వామిని అరుణాచలేశ్వరుడి కంటే భిన్నంగా మీరు చూడకండి. రమణస్వామి నోటివెంట ఒక వాక్కు వస్తే, అది అరుణాచలేశ్వరుడు అన్నట్టే. రమణస్వామి ఏదైనా రచన చేస్తే, అది అరుణాచలేశ్వరుడు చేసినట్టే. ఆ కొండే రూపం ధరించి వచ్చింది. మళ్ళీ రూపం విడిచిపెట్టి ఆ కొండలో కలిసిపోయింది. అంచేత అరుణాచలేశ్వరుడు రమణమహర్షి చూడటానికి వేరు కానీ, మూలంలో ఒకటే. ఉన్నది ఒకటే వస్తువు. రెండు అనేది మాయ. అందరి హృదయాలలో నువ్వే ప్రకాశిస్తున్నావు. పైకి ఊరికే చూడటానికి బేధం కనిపిస్తోంది. అందరి హృదయాలలోనూ ఉన్నది నువ్వే, అంతటా ప్రకాశించేది నువ్వే. నువ్వు తప్పించి ఈ లోకంలో ఏదీ లేదు. నిన్ను తెలుసుకొనే వరకూ లోకంలో వేరు వేరుగా, భిన్నత్వం ఉన్నట్టు కనిపిస్తుంది. నిన్ను తెలుసుకున్నాక తెలుస్తుంది లోకంగా ఉన్నది కూడా నువ్వే అని.



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

ఆధ్యాత్మిక జీవితానికి ఏమైనా ముగింపు ఉందా లేక ఇలా జపాలు, ధ్యానాలు చేసుకోవటమేనా అని చాలా మంది అడుగుతారు. మనోనాశనం అయితేనే కాని నీ లోపల ఉన్న సద్వస్తువు నీకు తెలియబడదు. నీ లోపల ఉన్న శాంతిసామ్రాజ్యానికి నువ్వు అధిపతి అయిన తరువాత నీకు అక్కడ ముగింపు ఉంది. ఎందుచేతనంటే నీ లోపల ఉన్న శాంతి నీకు అనుభవంలోనికి వచ్చిన వెంటనే, దానితో నువ్వు వన్‌నెస్ ని సంపాదించిన వెంటనే, దానితోటి సమానమైన శాంతి కాని, దానికి మించిన శాంతి కాని లేదని నీకు అనుభవంలోనికి వస్తుంది. ఆధ్యాత్మిక జీవితానికి అదే ముగింపు. భగవద్గీతలో దీనికి ముగింపు చెప్పారు.

**విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః**
**నిర్మమో నిరహంకారః సశాంతి మధిగచ్ఛతి ఎ (2-71)**

తాత్పర్యము: కోరికలన్నింటిని త్యజించి, మమతా, అహంకార, స్పృహా రహితుడై చరించు పురుషుడు శాంతిని పొందును.

దేహం కేంద్రంగా, మనస్సు కేంద్రంగా పెట్టుకొని మీకు కోరికలు వస్తూ ఉంటే, వాటిని మెర్సిలెస్‌గా విడిచిపెట్టాలి. మన చేతిమీద కురుపు వేసింది అనుకోండి, మన చేతిమీద కురుపు వేసింది అని శ్రద్ధగా చూసుకుంటామా? చూసుకోము, వెంటనే డాక్టరు దగ్గరికి వెళ్లి కోయించేసుకుంటాము. అలాగే నీకు ఉపయోగం లేని ఆలోచనలు, నీ దేహం యొక్క ఆరోగ్యం, నీ మనస్సు యొక్క ఆరోగ్యం పాడుచేసే కోరికలు వస్తూ ఉంటే వాటిని మెర్సిలెస్‌గా విడిచి పెట్టండి అని పరమాత్మ చెబుతున్నాడు.

నిస్పృహః - అంటే నీకు ప్రాపంచిక విషయాల మీద స్పృహ ఉండకూడదు. కొంతమందికి కోరికలు స్థూలంగా లేకపోయినా, సూక్ష్మంగా ఉంటాయి. కాళిదాసు ఏమన్నాడంటే మీరు జున్ను ఇష్టం లేదు అనవచ్చు, కాని దొరికితే తినేస్తారు. అలా కాదు,

మీకు ఎన్ని ఇంద్రియాలు ఉన్నాయో, ఆ ఇంద్రియాలకి సంబంధించిన భోగాలు అన్నీ మీకు ఎదురుగా ఉండాలి. ఆ భోగాలు ఎదురుగుండా ఉన్నప్పటికీ వాటి మీద మీకు ఆకర్షణ కలగకుండా ఉంటే అది వైరాగ్యం. మనల్ని కొన్ని కోరికలు బంధిస్తాయి, కొన్ని కోరికలు బంధించవు. మనకు పునర్జన్మని తీసుకువచ్చే కోరికలే ప్రమాదం. నువ్వు సాధన చేసి పునర్జన్మలని కలగజేసే కోరికలన్నీ వదులుకోవాలి. సూక్ష్మంగా ఉన్న కోరికలు పైకి కనబడవు. సమయం వచ్చినప్పుడు బయటకు వస్తాయి. అందుచేత సూక్ష్మరూపంలో ఉన్న కోరికలని నువ్వు సాధన చేసి, భగవంతుడి అనుగ్రహాన్ని సంపాదించి, వాటిని బయటకు తరమాలి.

నిర్మమః - అంటే ఎక్కడా కూడా మీకు ఎటాచ్‌మెంట్ ఉండకూడదు. ఎటాచ్‌మెంట్ లేనివాడికి దుఃఖం లేదు, అశాంతి లేదు. ప్రారబ్ధాన్ని బట్టి వాడికి ఏదైనా వచ్చినా, వాడికి ఏమీ అనిపించదు. అది పోయినప్పుడు కూడా వాడికి దుఃఖం లేదు. నేను, నాది లేనివాడికి అశాంతి లేదు, దుఃఖం లేదు. నువ్వు ఎంతో ఇష్టపడుతున్న నీ శరీరమే నీది కానప్పుడు, ఈ సృష్టిలో ఏది నీది, అన్నాడు గౌతమబుద్ధుడు. మీరు పెద్ద సాధన చెయ్యనక్కరలేదు. జపాలు అక్కరలేదు, ధ్యానం అక్కరలేదు. మీరు ప్రశాంతముగా కూర్చోండి. మీ మనస్సును పరిశీలన చేయండి. మనస్సు ఎక్కడికి వెళ్ళుతోందో అక్కడ మమకారం ఉన్నట్టు. మీకు మమకారం లేదు అనుకోండి, మనస్సు బయటికి కదలమన్నా కదలదు. ఈ జపం, ధ్యానం మనస్సుని నిగ్రహించుకోవటానికే. రోగం ఉన్నవాడికి మందు కానీ, రోగం లేని వాడికి మందు ఎందుకు? మీకు మమకారం ఉంది కాబట్టి సాధన చెయ్యాలి. మమకారం లేకపోతే, సాధనతోటి పని ఏమిటి? తప్పులు చేయించేది మమకారం. మనుషులని చంపేది మమకారం. మనం బెంగ పెట్టుకోవటం, ఏడవటం వీటి అన్నిటికీ కారణం మమకారమే. నీకు మమకారం ఉంటే సహజంగా సంతోషంగా చావవు. ఏడుస్తూ దిక్కులేని చావు చస్తావు. పుట్టినప్పుడు నువ్వు ఏడుస్తూ పుట్టావు. నీకు చనిపోయే రోజు వచ్చేటప్పటికి ఆ ఏడుపు పోగొట్టుకొని శాంతిగా, సంతోషంగా చనిపోవాలి. అప్పుడు నీకు పునర్జన్మ లేదు. నువ్వు పుట్టినప్పుడు ఏడుపే, చనిపోయేటప్పుడూ ఏడుపేనా? మరి నువ్వు ఎందుకు పుట్టావు? నువ్వు ఆ ఏడుపు పోగొట్టుకోవటానికి పుట్టావు కానీ నువ్వు ఏడుపు ఎక్కువ చేసుకొని చనిపోతున్నావు. నీకు అసలు దైవస్మరణ లేదు. వాడిని చూడాలి వీడిని చూడాలి అంటున్నావు. వాడు నీకు మోక్షం ఇస్తాడా? మీ పిల్లలు కాని, మనుమలు కాని చూస్తారని మీరు ఎప్పుడూ అనుకోవద్దు. ఎవ్వరూ మిమ్మల్ని చూడరు. మీ జాగ్రత్తలో మీరు ఉండండి. ఇది డార్క్ ఏజ్. కృష్ణుడు శరీరం విడిచిపెట్టేసాక కలియుగం ప్రారంభమయ్యింది. కలియుగం అంటే చీకటి రోజులు. మీకు వెలుతురు కనబడదు. మనం సాధన చేసుకోవటానికి ప్రయత్నం చేస్తే 90 మంది ఆక్షేపిస్తారు. భగవంతుడిలో ఐక్యమవ్వటానికి మనకి ఎవరూ ప్రోత్సాహం ఇవ్వరు. అది యుగ లక్షణం. అందుచేత మీరు అమాయకత్వంగా ఉండకండి. ఇప్పుడు రోజులు ఎటువంటివి అంటే డబ్బులేని వాళ్ళు బతకగలరు కాని అమాయకత్వంగా ఉన్నవాళ్ళు అసలు బతకలేరు. మిమ్మల్ని చూసే బాధ్యత మాది కదా అంటే నమ్మకండి. ఆ మాటలు పోషించుకోవటానికి

వాళ్ళు ఏమైనా శ్రీరాముడా, లక్ష్మణుడా?  కాదు, మనం మనుషులం. అలా ఉన్నందుకు వాళ్ళని తిట్టనక్కరలేదు. మన జాగ్రత్తలో మనం ఉంటే సరిపోతుంది. మనం ఏ యుగంలో ఉన్నామో, ఆ యుగంలో ఉన్నట్టే బతకాలి. ఆత్మజ్ఞానం కలిగితే వాళ్ళ విషయం వేరు. జ్ఞానం కలిగాక, బాడిలెస్, మైండ్ లెస్, వరల్డ్ లెస్, అండ్ గాడ్ లెస్ ఆల్సో.  ప్రపంచమే లేనివాడికి మిగతా గొడవలు ఏమిటి? వాడికి చూచినా ఒకటే, చూడకపోయినా ఒకటే.

రాముడి కూడా అరణ్యానికి వెళుతున్నాను అని లక్ష్మణుడు, తల్లి సుమిత్ర తోటి చెపితే, నువ్వు రాముడి సేవ చెయ్యటానికి వెళుతున్నావు. రాముడు సాక్షాత్తు నారాయణుడు. నువ్వు రాముడిని అన్నగారు అనుకోవద్దు. నీ తండ్రి అనుకో. సీతమ్మని వదినగారు అనుకోవద్దు, నీ తల్లి అనుకో. రాముడి గురించి మనం అడవిలోకి వచ్చాము అని ఏడవకు. అరణ్యాన్ని అయోధ్యగా చూడు. నువ్వు భగవంతుడి సేవ చేయటానికి వెళుతున్నావు అని సుమిత్ర లక్ష్మణుడిని ఆశీర్వదించింది. సుమిత్ర మహాజ్ఞాని.

నిరహంకారం అంటే అహంకార రహితస్థితి. నిరహంకార స్థితి ఎలా వస్తుంది అంటే, అది ఇంపెర్సనల్ బిహేవియర్  వల్ల వస్తుంది. అహంకారం అంటే చాలా మంది కోపం అనుకుంటారు. అహంకారం అంటే కోపం కాదు, దేహం పట్ల ఎవడికైతే ఆత్మబుద్ధి ఉందో వాడిని అహంకారి అని పిలుస్తారు. మనం చేసే సాధనలన్నీ నిరహంకార స్థితిని సంపాదించటానికే. మనకి నేను అనే తలంపు ఉన్నప్పుడు, నాది అనే తలంపు కూడా వస్తుంది. మనకి నేను అంటే చైతన్యం స్ఫురించదు, మనకి దేహం స్ఫురిస్తుంది. అప్పుడు ఈ దేహానికి సంబంధించిన వాళ్ళందరూ సిద్ధమవుతారు. మీ ఇంట్లో ఎవరైనా చనిపోయారు అనుకోండి, మీకు చాలా దు:ఖం వచ్చేస్తుంది. మీ పక్కింటి వారు ఎవరైనా చనిపోతే మీకు దు:ఖం రాదు. ఎందుచేత అంటే, మీ ఇంట్లోవాళ్ళు చనిపోయినప్పుడు నాది అనిపిస్తుంది. దేహం నేను అనుకున్నంత కాలం నాది వస్తుంది. ఈ నాది లోంచి మళ్ళీ దు:ఖం ప్రారంభం అవుతుంది. అహంకారం లేని వాడికి మమకారం ఉండదు. అసలు దు:ఖం రావటానికి ఎటాచ్‌మెంట్ కారణం. మీరు ప్రశాంతంగా కూర్చోండి. మీకు ఎక్కడా ఇష్టాలు లేవు అనుకోండి, ఎక్కడా అయిష్టాలు లేవు అనుకోండి, అప్పుడు మీ మనస్సు ఎక్కడైనా చలిస్తుందేమో చూడండి. మీకు ఎక్కడైనా ఇష్టం ఉంటే, మీ మనస్సు అక్కడ వాలుతుంది. మీకు అయిష్టం ఉంటే మీ మనస్సు అక్కడ వాలుతుంది. మీకు ఇష్టాలు అయిష్టాలు లేవు అనుకోండి, మీ మనస్సు ఇంక చలించదు.

కొంతమంది చెడ్డ మాటలు మాట్లాడుతూ ఉంటారు. చెడ్డ పనులు చేస్తూ ఉంటారు. వారికి చెడ్డ ఆలోచనలు వస్తూ ఉంటాయి. వాటివలన వారికి ఏమైనా ఉపయోగం ఉందా? అవి ఈ లోకానికి పనికిరావు, పరలోకానికి  పనికిరావు. మరి అవసరంలేని మాటలు ఎందుకు మాట్లాడుతున్నారు? మనం పది పనులు చేస్తే, అందులో ఎనిమిది అవసరం లేని పనులు చేస్తూ ఉంటాము. ఎందుకు ఇలా చేస్తున్నాము అంటే దానికి మనస్సు యొక్క చాపల్యమే కారణం. నువ్వు అహంకారంతో కలిసి తిరుగుతూ ఉంటే నీకు శాంతి ఎలా కలుగుతుంది? అహంకారం ఉంటే మమకారం వస్తుంది. మమకారం ఉన్నప్పుడు నీకు

శాంతి ఎలా కలుగుతుంది. కొంతమంది, నేను ఆ మంచిపని చేసాను, ఈ మంచిపని చేసాను అంటారు. నువ్వు ఏదైనా మంచిపని చేస్తే దాని తాలూకు స్పృహ కూడా ఉండకూడదు. ఎక్కడా నీకు ఆసక్తి పనికిరాదు. నువ్వు ఆసక్తి లోంచి విడుదల పొందకపోతే, కోటిజన్మలు ఎత్తినా నీకు శాంతి రాదు. మీరు బంగారపు వస్తువులు మెడలో ఎలా అలంకరించుకుంటున్నారో, అలాగ నేను అది సాధించాను ఇది సాధించాను అని అనుకుంటూ ఉంటే, ఆ నేను తాలూకు స్పృహలో నువ్వు ఎక్కువగా ఉంటే, నీ అహంకారం లోపల ముస్తాబు అయిపోతూ ఉంటుంది. అది నీకు తెలియదు. దేహాత్మబుద్ధి పోవటం చాలా కష్టం. దాని కోసం ఎంతో సాధన చేయాలి. ఒకవేళ సాధన చేసినా గురువు అనుగ్రహం లేకపోతే, ఈ దేహాత్మబుద్ధిలో నుండి మనిషి విడుదల పొందలేడు.

వేదంలో ఏమని చెప్పాడు అంటే, నీకు గౌరవం ఉన్నంత మాత్రం చేత, అధికారం ఉన్నంత మాత్రం చేత, ఐశ్వర్యం ఉన్నంత మాత్రం చేత, చదువు ఉన్నంత మాత్రం చేత, మోక్షం రాదు. నువ్వు పరమపవిత్రుడవు అయితే, నీకు ప్రేమతత్వం ఉంటే, నీకు సత్కర్మ నిష్కామంగా చేసే స్వభావం ఉంటే, ఇవన్నీ నీకు ఉంటే మోక్షం వస్తుంది. కాని బయట గొడవల వలన నీకు మోక్షం రాదు అని వేదంలో చెప్పాడు.

శారీరకజీవితం, మానసికజీవితం, వీటికి సంబంధించినటువంటి స్పృహ లేనివాడిని, అహంకార రహితుడిని, మమకార రహితుడిని మాత్రమే శాంతి వరిస్తుంది. అప్పటివరకూ నువ్వు సాధన చేస్తూ ఉండవలసిందే. ఎప్పుడైతే అహంకారంలోంచి నువ్వు బయటకు వచ్చావో, అప్పుడు నీవు పొందేది లౌకికమైన ఆనందం కాదు, బ్రహ్మానందాన్ని పొందుతావు.

మేము దేహగతమైన నేను కోసమే జీవిస్తున్నాము కదా! ఈ నేనుని పోగొట్టుకుంటే ఎలాగండి అని చాలామంది అనుకుంటారు. ఎంతసేపు ఆ నేనుతోనే కలిసి జీవిస్తాడు కదా, అందుచేత ఆ నేను పోతే వాడు పోతాను అనుకుంటాడు. ఆ నేను పోతే వాడు పోడు, వాడు ఎవడో వాడికి తెలియబడుతుంది. దానినే బ్రాహ్మీస్థితి అంటారు. అది మొదలు చివర లేని పరమస్థితి. ఇక్కడ పరమాత్మ ఏమని చెపుతున్నాడు అంటే, నీ దేహం ఈ భూమి మీద తిరుగాడుతున్నప్పుడే ఆ బ్రాహ్మీస్థితిని పొందితే మంచిదే. కాని ఇప్పుడు నువ్వు పొందలేవు అనుకో, నీ శరీరం పోయే టైముకి అయినా నువ్వు కష్టపడి సాధన చేసి, సాధన చేసి, అంత్యకాలంలో నీ ప్రాణం పోయే టైములో అయినా బ్రాహ్మీస్థితిని నువ్వు పొందగలిగితే నువ్వు మోక్షసుఖాన్ని పొందుతావు. అప్పుడు నీకు ఇంక పునర్జన్మ లేదు. మీ శరీరం చనిపోయేటప్పుడు మీరు పూర్తిగా ఆనందంగా ఉన్నారా లేదా చూసుకోండి. అంటే బాహ్యపరిస్థితుల తోటి సంబంధం లేకుండా, మీ కుటుంబపరిస్థితుల తోటి సంబంధం లేకుండా, మీ దేహప్రారబ్ధం తోటి సంబంధం లేకుండా, మీ ప్రాణప్రయాణ టైములో మీరు నూటికి నూరు పాళ్ళు బ్రహ్మానందంలో ఊగిసలాడుతూ ఉంటే, వాడికి పునర్జన్మ లేదు అర్జునా అన్నాడు పరమాత్మ.

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | | |
|---|---|---|
| ఫిబ్రవరి | 16 | ఆదివారం హైదరాబాద్ అరుణగారి ప్రవచనము |
| ఫిబ్రవరి | 21 | మహా శివరాత్రి - శుక్రవారం<br>మధ్యాహ్నం గం॥ 2-00లకు భీమవరం సీతారామరాజు (రాముగారు) ప్రవచనము |
| మార్చి | 1 | ఆదివారం అమలాపురం మాష్టారు ప్రవచనము |

SRI RAMANA KSHETRAM A/c. No. 6794857762

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై ఫోన్ : 04175-236174**

**For Accomodation : Office Incharge Balaraju 08297672348, 9849124502**

**ది॥ 13-03-2020 శుక్రవారం**

## సద్గురు శ్రీ నాన్నగారి

# విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

**శ్రీరమణక్షేత్రం, జిన్నూరు**

| | | |
|---|---|---|
| ఉ॥ గం॥ | 6-00లకు | పారాయణ |
| | 7-00లకు | అల్పాహారం |
| | 8-00లకు | పూజాకార్యక్రమములు |
| | 9-00లకు | భక్తుల ప్రవచనములు |
| | 11-00లకు | అన్నప్రసాదం |
| మ॥గం॥ | 1-00లకు | హైదరాబాద్ అరుణగారి ప్రవచనము |

**భక్తులందరికీ ఆత్మీయ ఆహ్వానము**

# దేహగతమైన 'నేను' లేనప్పడే - దేవుడు ప్రకటితమౌతాడు

మనస్సు ఓ అద్భుతం. ఓ ఉల్లిగడ్డను అర్థం చేసుకున్నట్లే, మనం దాన్ని అర్థం చేసుకోవాలి. ఉల్లిగడ్డ పొరలను తీస్తే ఏమీ లేదు. మనస్సులో తలంపులు పోతే మనస్సు లేదు. నేను-నేను అనుట ఆ పదాన్ని చేతనైతే దాన్నించి తప్పించుకొని పారిపోవాలి. దూదికి నిప్ప అంటుకొంటే ఎంతసేపు కాలకుండా ఉంటుంది. 'నేను' జీవితాన్ని కాల్చేస్తుంది. 'నేను' అన్నది సమాధి స్థితిలో ఉండదు అంటారు అనుభవజ్ఞులు 'నేను' అన్నది మాయమైపోయిన తరువాతే మిగిలి ఉండే స్థితే సమాధి. చైతన్యం మీద దుమ్ము (వాసనలు) తొలగించుకోవటం అంటే అర్థం మీద దుమ్ము తొలగించటం లాంటిది. నిజానికి ఈ సృష్టికి కేంద్రంగా ఉన్నది ఒక్కడే అదే నిజమైన నేను అనే మాటను అనే హక్కు ఉంది. కాని అతనికి నేను అనవలసిన పని ఉండదు. భగవాన్‌కు ఇతరులకు విషయం అర్థం కానప్పడు తప్పని పరిస్థితిలో 'నేను' అనేవారు. ఎందుచేతనంటే అన్నీ సర్వం ఆయనకు 'నేనే' కనుక. శ్రీనాన్నగారు "దేహగతమైన నేను ఎక్కడ కనిపించినా దాన్ని వెంటాడి హతమొనర్చండి అది చెయ్యలేకపోతే అజ్ఞానం చేతుల్లో జీవితం పొడుగునా బంధీగా ఉంటాము. ఓర్పును స్వరూపంగా చేసుకొన్నవాడు అహంకార రహితుడు అవుతాడు" అన్నారు. మన అంతరంగం తీరని తృష్ణలతో, వాంఛలతో, అత్యాశలతో, ఆవేశాలతో నిండిపోయింది. ఇతరుల నుద్దేశించిన గుడ్డి నమ్మకాల నుండి బయటపడటం సత్యాన్వేషి మొట్టమొదట చేయవలసిన పని. గుడ్డినమ్మకాలను నమ్మేవాడు సత్యాన్ని ఎన్నటికీ కనుక్కోలేడు. సాధకులు భార్య యొక్క లేదా స్త్రీ తన భర్త యొక్క మాంసంతో కూడిన అస్థిపంజరం మీద విశ్వాసం పెట్టుకోకూడదు. అంతర్గతమైన దైవత్వమునందు విశ్వాసం ఉంచుకోవాలి. శరీరాన్ని మాయతెరగా చూడాలి. దాని వెనుక మారకుండా వెలుగొందే అంతర్గతమైన చైతన్యాన్ని భావన చెయ్యాలి. అదే నిత్యమని ఎల్లప్పడు భావించాలి అప్పడే మనం ఎరుకలో ఉన్నట్లు. ఆ జాగరూకతతోనే సత్యం ప్రకటితమౌతుంది. నేను నా ధనాన్ని, సంసారాన్ని, బంధుత్వాన్ని మన అహానికి పూతగా ఉండే వాటిని సన్యసిస్తే మన అహానికి ఎలాంటి మద్దతూ ఉండదు. మనం ఎవరిమో అనేది మరలా మరలా గుర్తు చేసుకొంటే ఒక్క దెబ్బతో ప్రయాణం ముగుస్తుంది. కాని నిజానికి మనం మన అహంకారాన్ని రక్షించుకోవటానికే ఇష్టపడతాము. ఎదగటానికి అంగీకరించం. కారణం వాసనాబలం అలా చేస్తుంది. దానికి గురువు యొక్క కరుణాపూరితమైన ఒక్కచూపు చాలు అవి నశించిపోతాయి. దానికి కాల పరిపక్వం, స్వయంకృషి కావాలి. బాహ్యం నుంచి వస్తున్న దేనివల్లనైనా నాలో కలత కలిగితే నా బయట ఉన్న ఎవరివల్లనైనా అంతరం ప్రభావమైనా మార్పు కలిగినా 'నేను' బానిసగానే ఉన్నట్లే ఏమి జరిగినా నిజమైన నేనుగా ఉంటే స్వతంత్రానికి ఓ ప్రారంభ సంకేతంగా ఉంటుంది. మోక్షమంటే ఇంకోచోటికి వెళ్లవలసిన స్థానం కాదు. అజ్ఞాన గ్రంధి భేదమే మోక్షం.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**